వైఎస్ఆర్
కడప
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
మంగళవారం 17 మార్చి 2026



## శ్రీ ఆగస్త్యేశ్వర స్వామి ఆలయ భూములకు హద్దులు ఏర్పాటు చేసి దేవస్థానానికి అప్పగించాలి

ప్రొద్దుటూరు అర్బన్ మార్చి 16 ప్రభాతవార్త



శ్రీ ఆగస్త్యేశ్వర స్వామి దేవస్థాన ఆలయమునకు సంబంధించినటువంటి వ్యవసాయ భూములకు తమ సిబ్బందితో హద్దులు ఏర్పాటుచేసి దేవస్థానానికి అప్పగించాలని ఆలయ కార్యనిర్వాణాధికారి కె.వి రమణ,ఆలయ చైర్మన్ వంగల నారాయణరెడ్డి మరియు పాలకమండలి సభ్యులు ప్రొద్దుటూరు తహసిల్దార్ గంగయ్యను సోమవారం వినతి పత్రము ద్వారా కోరారు.అందులకు తహసిల్దార్ గంగయ్య పై విషయమును పరిశీలించి వెంటనే చర్య తీసుకుంటామని తెలిపారు.

## కడప జిల్లాలో 14 మంది

# తహసీల్దారుల బదిలీలు

**రాజంపేట, కడప, బద్వేల్ తాసిల్దార్లు బదిలీ**

రాజంపేట, మార్చి 16 ప్రభాతవార్త

కడప జిల్లాలో 14 మంది తహసీల్దారులను బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ముఖ్యమైన కేంద్రాల్లో పని చేసే తాసిల్దార్లను దాదాపు బదిలీ చేశారు. రాజంపేటలో పనిచేస్తున్న తహసిల్దార్ పీర్ మున్ని బద్వేల్ కు బదిలీ చేశారు. బద్వేల్ లో పనిచేస్తున్న ఉదయ్ భాస్కర్ రాజును పోరుమామిళ్ళకు బదిలీ చేశారు. రాజంపేట తాసిల్దార్గా బి. కోడూరులో పనిచేస్తున్న దస్తగిరయ్యను బదిలీ చేశారు. అలాగే పులివెందుల ఆర్డిఓ కార్యాలయం ఏవోగా వి వెంకటసుబ్బయ్య ,కడప భూ సంస్కరణ విభాగానికి టి సరస్వతి, కలసపాడు తాసిల్దార్ గా జి. రవీంద్రారెడ్డి ,జమ్మలమడుగు తాసిల్దార్ కే.వెంకట సాయినాథరెడ్డి, రాజుపాలెం తాసిల్దార్ గా వై. హరినాధ రెడ్డి, కమలాపురం తాసిల్దారుగా పి. శ్రీనివాస్ రెడ్డి, పెండ్లిమర్రి తహసిల్దార్ కే. శోభన్ బాబు, కలెక్టరేట్ కార్యాలయంకు వి. గంగయ్య, ఎర్రగుంట తాసిల్దార్గా జి.అమరేశ్వరి, కడప తాసిల్దార్ గా ఎస్.మహబూబ్ చాంద్ ను బదిలీ చేశారు.

## బ్రహ్మోత్సవాలకు వస్తున్న భక్తులకు అన్ని

# సౌకర్యాలు కల్పించాలి

- టీటీడీ అధికారులతో, జిల్లాస్థాయి అధికారులు సమన్వయం కావాలి
- మార్చి 27 నుంచి జగదభిరాముని బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- కళ్యాణోత్సవానికి భారీ ఏర్పాట్లు
- తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా కళ్యాణానికి ఏర్పాట్లు చేయాలి
- కడప జిల్లా కలెక్టర్ చెరుకూరి. శ్రీధర్, టీటీడీ అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, ఎస్పీ సచ్చేత్ విశ్వనాథ్, టిటిడి జెఈఓ వీరబ్రహ్మం






ఒంటిమిట్ట మార్చి.16. ప్రభాతవార్త

2026 మార్చి 27వ తేదీ నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు ఏకశిలా నగరం ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాలు టిటిడి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో ఆలయ పరిసరాలు, కళ్యాణ వేదిక వద్ద టిటిడి ఆధ్వర్యంలో గుత్తేదారులు చేపడుతున్న అభివృద్ధి పనుల పరిశీలన నిమిత్తం సోమవారం టీటీడీ అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, కడప జిల్లా కలెక్టర్ చెరుకూరి .శ్రీధర్ ,కడప జిల్లా ఎస్పీ సచికేత్ విశ్వనాథ్, వీరబ్రహ్మం తదితర ఉన్నతాధికారులు ఒంటిమిట్టకు రావడం జరిగింది. ముందుగా వారు జగదభి రాముని దర్శనార్థం ఆలయంలోనికి వెళ్లడం జరిగింది. ఈ సందర్భంగా అర్చకులు టీటీడీ పర్యవేక్షణలో వారికి ఆహ్వానం పలికారు. అనంతరం వారి గోత్రనామాలతో శ్రీరామునికి ప్రత్యేక పూజలు చేశారు. ఘనంగా సత్కరించి ఆశీర్వచనం గావించారు. తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం వారు బ్రహ్మోత్సవాలకు వస్తున్న భక్తుల సౌకర్యార్థం ఆలయం వెలుపల, లోపల భాగాల్లో, కళ్యాణ వేదిక వద్ద గుత్తేదారులు చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రత్యేకంగా పరిశీలించడం జరిగింది. జగదభి రాముని బ్రహ్మోత్సవాలు సమీపిస్తున్నాయని సమయం చాలా తక్కువగా ఉన్నదని టిటిడి అధికారులు నిర్దేశించిన సమయానికల్లా ఎటువంటి జాప్యం లేకుండా పనులన్నీ సకాలంలో పూర్తి చేయాల్సిందిగా ఆదేశించారు. అనంతరం టిటిడి పరిపాలన కార్యాలయంలో జిల్లా, టిటిడి క్షేత్రస్థాయి అధికారుల ప్రత్యేక సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ ప్రసంగిస్తూ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలకు వస్తున్న భక్తులకు ఎటువంటి రాజీ లేకుండా సమయపాలనగా గత స్మృతులను దృష్టిలో పెట్టుకొని పద్ధతి ప్రకారం అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించాడు. మెరుగైన సేవలు అందించాలన్నాడు. అధికారులందరూ కలిసికట్టుగా పనిచేసి ముందస్తు ప్రణాళికలు రూపొందించాలన్నాడు. శ్రీరామనవమి, కళ్యాణోత్సవము, ముఖ్య దినాల్లో పలు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరవుతారని భద్రతను ముమ్మరం చేయాలని క్యూలైన్ల వద్ద ఆలయ ప్రదేశాల వద్ద తనిఖీలు చేస్తూ జాగ్రత్తగా ఉండాలన్నాడు. వాహన ప్రదేశాలను ముందస్తుగా ఎన్నుకొని పనులు ఉంటే పూర్తి చేయాలన్నాడు. వాహన పార్కింగ్ ప్రదేశాల పరిశీలన ,పోలీసు భద్రత, మంచినీరు, మజ్జిగ, అన్న ప్రసాదాలు భక్తులకు సక్రమంగా అందించాలన్నాడు. తాత్కాలిక మరుగుదొడ్లు, ప్రథమ చికిత్స కేంద్రాలు, భక్తుల రాకపోకల రవాణా సదుపాయాలు, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా, హెల్ప్ డెస్కులు, సూచిక బోర్డులు, పారిశుధ్యం, పబ్లిక్ అడ్రస్ సిస్టం వంటి అన్ని శాఖల విభాగాలు ప్రణాళిక బద్ధంగా పనిచేయాలన్నాడు. ఏ విషయంలోనూ రాజి లేకుండా గతించిన అనుభవాలను దృష్టిలో ఉంచుకొని బాధ్యతాయుతంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నాడు. ఎటువంటి పొరపాటు లేకుండా చాలా నైపుణ్యంగా వ్యవహరించాలన్నాడు. అనంతరం టిటిడి అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య నాయుడు మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు వస్తున్న భక్తులకు తెలుగు సాంప్రదాయాలు ఉట్టిపడే విధంగా ఆలయాన్ని, పరిసరాలను, కళ్యాణ వేదికను అత్యంత శోభాయమానంగా అలంకరించాలన్నాడు. ఏప్రిల్ 1వ తేదీన టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహించే సీతారామ కళ్యాణోత్సవానికి ముఖ్యమంత్రి దంపతులుగా వస్తున్నారని నిర్వహించాల్సిన పనులన్నీ సకాలంలో పూర్తి చేయాలన్నాడు. భక్తులను ఆకట్టుకునే విధంగా విద్యుత్ దీపాలంకరణ, పుష్పాలంకరణలు చేయాలన్నాడు. కళ్యాణ వేదిక వద్ద ఉన్న గ్యాలరీలలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా శ్రీవారి సేవకులు మంచినీరు, మజ్జిగ ,అన్న ప్రసాదాలు ఎప్పటికప్పుడు అందిస్తూ తోపుసలాట లేకుండా చూసుకోవాలన్నాడు. ప్రవేశ, నిష్క్రమణ క్యూలైన్ల వద్ద భద్రత పెంచుతూ ముమ్మరంగా తనిఖీలు చేయాలన్నాడు. వేసవి కావడం చేత వడదెబ్బ తగలకుండా భక్తులను రక్షించాలన్నాడు. స్థానిక అధికారులతో సమన్వయంగా ఉండి పారిశుధ్యం పై పరిశుభ్రతపై దృష్టి పెట్టి వ్యవహరించాలన్నాడు. వాహన పార్కింగ్ సమస్యలు లేకుండా పోలీసు బలగాలతో ఐకమత్యంగా ప్రవర్తించాలన్నాడు. గ్యాలరీలలో ఉన్న భక్తులకు అన్ని సౌకర్యాలు సక్రమంగా అందాలన్నాడు.

మార్చి 26వ తేదీ అంకురార్పణతో కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని జేఈవో వీర బ్రహ్మం తెలియజేశాడు. అన్ని శాఖల వారీగా తగు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది. వాహన సేవలు, గ్రామోత్సవాలు, నిర్వహిస్తున్న సమయంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు, కోలాటాలు, వాయిద్యాలు, చెక్కభజనలు ఇవన్నీ కూడా ఉంటాయని పర్యవేక్షణ నిమిత్తం శాఖల వారీగా విభజించడం జరుగుతుందన్నాడు. ఈ కార్యక్రమంలో జిల్లా క్షేత్రస్థాయి ఉన్నతాధికారులు, టీటీడీ సీఈ సత్యనారాయణ, ఎస్ ఈలు వెంకటేశ్వర్లు, మనోహరం, నరసింహమూర్తి, డిప్యూటీఈవోలు సెల్వం, శివ ప్రసాద్, శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన

# మొదటిరోజు పదో తరగతి పరీక్ష

**మొదటి రోజు పరీక్షకు 156 మంది విద్యార్థులు గైర్హాజర్**

**బి కోడూరు మండలం పరీక్షా కేంద్రంలో ప్రత్యక్షమైన పాము**

ఎడ్యుకేషన్ మార్చి 16 ప్రభాతవార్త :

జిల్లాలో సోమవారం నిర్వహించిన పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. జిల్లాలో మొత్తం 167 పరీక్షా కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలను నిర్వహించారు. పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ అధికారులు, రెవెన్యూ, పోలీస్ శాఖల సమన్వయంతో విస్తృతమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి, మాస్ కాపీయింగ్ వంటి ఘటనలు జరగకుండా పర్యవేక్షించారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడా మాస్ కాపీయింగ్ లేదా ఇతర అవాంఛనీయ సంఘటనలు జరగలేదని అధికారులు తెలిపారు.ఈ రోజు నిర్వహించిన పరీక్షలకు 166 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మిగతా విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకుని ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాశారు.ఇక ఓపెన్ పదో తరగతి పరీక్షలు కూడా జిల్లాలో 31 కేంద్రాల్లో నిర్వహించారు. ఓపెన్ పరీక్షలకు హాజరుకావాల్సిన విద్యార్థుల్లో 389 మంది గైర్హాజరయ్యారు. ఓపెన్ స్కూల్ విధానంలో చదువుతున్న విద్యార్థులు కూడా పెద్ద సంఖ్యలో పరీక్షలకు హాజరై తమ ప్రతిభను ప్రదర్శించారు.మొదటి రోజు నిర్వహించిన భాషా పరీక్షలకు సంబంధించి, తెలుగు పరీక్షకు 2,261 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 1,875 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. అలాగే ఉర్దూ పరీక్షకు 63 మంది హాజరుకావాల్సి ఉండగా, 61 మంది విద్యార్థులు పరీక్ష రాశారు.అయితే జిల్లాలోని బి.కోడూరు మండలంలోని ఒక పరీక్షా కేంద్రంలో చిన్నపాటి కలకలం చోటు చేసుకుంది. పరీక్ష జరుగుతున్న సమయంలో అకస్మాత్తుగా ఒక పాము పరీక్షా కేంద్రంలోకి రావడంతో విద్యార్థులు భయంతో ఒక్కసారిగా బయటకు పరుగులు తీశారు. పరిస్థితిని గమనించిన సిబ్బంది వెంటనే స్పందించి పామును తొలగించి బయటకు పంపడంతో విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం పరీక్షలను యథావిధిగా కొనసాగించారు.మొత్తం మీద జిల్లాలో పదో తరగతి పరీక్షల మొదటి రోజు ఎలాంటి అవాంతరాలు లేకుండా ప్రశాంతంగా పూర్తయ్యిందని విద్యాశాఖ అధికారులు తెలిపారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో అన్ని శాఖలు సమన్వయంతో పని చేస్తున్నాయని, మిగిలిన పరీక్షలు కూడా ఇదే విధంగా సజావుగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

## రైల్వే గూడ్స్ కేంద్రాలలో అక్రమాలు

# నిరోధించేందుకు కృత్రిమ మేధ కెమెరాలు

రాజంపేట, మార్చి16 ప్రభాతవార్త






రైల్వే షెడ్లలో సరుకుల తరలింపు, సరఫరా లో ఎలాంటి అక్రమాలకు అవకాశం లేకుండా రైల్వే బోర్డు కృత్రిమ మేధ కెమెరాలను అమర్చేందుకు నిర్ణయం తీసుకుంది. ప్రధానంగా ఎక్కువ రవాణా, సరుకుల తరలింపు ఉన్న రైల్వే కేంద్రాలలో ఈ ఏర్పాట్లు చేస్తోంది. అందులో భాగంగా గుంటకల్ డివిజన్లో కడప, కృష్ణాపురం కేంద్రాల్లోని గూడ్స్ రైల్వే షెడ్లలో ఏఐ ఆధారిత కెమెరాలను ఏర్పాటు చేసేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలోని పైన పేర్కొన్న రెండు కేంద్రాలతో పాటు రేణిగుంట, రాయచూరు, బేతంచెర్ల, రంగాపురం, మల్కాపురం, పాణ్యం కేంద్రాలలో ఏఐ ఆధారిత కెమెరాలు ఏర్పాటు చేసేందుకు 4.54 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేసింది. ఏడాదిలోగా ఈ పనులు పూర్తి చేయాలని ఆదేశించింది. ఈ మేరకు గుంటకల్ రైల్వే ఇంజనీరింగ్ అధికారులు సోమవారం టెండర్లు కూడా పిలిచారు.

# అన్న ప్రసాద పంపిణీ కేంద్రం ప్రారంభోత్సవం

**ప్రారంభోత్సవంలో పాల్గొన్న టిటిడి చైర్మన్**





ఒంటిమిట్ట మార్చి.16 ప్రభాతవార్త

రెండవ అయోధ్య ఆంధ్ర భద్రాచలం ఏకశిలానగరం ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి ఆలయ సమీపంలో నూతన శాశ్వత అన్న ప్రసాద వితరణ కేంద్రాన్ని సోమవారం టిటిడి పాలకులు కోదండ రామస్వామి దర్శనార్థం ఒంటిమిట్టకు తరలివస్తున్న భక్తుల సౌకర్యార్థం ప్రారంభోత్సవం చేయడం జరిగింది. ఈ వేడుకకు ఆలయ టిటిడి బోర్డు మెంబర్ బి ఆర్ నాయుడు, రావడం జరిగింది. టీటీడీ పరిరక్షణలో ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో, భజంత్రీలతో ఆయనకు స్వాగతం పలికి ఆలయ ప్రదక్షిణ గావిస్తూ అంతరాలయంలోకి తీసుకెళ్లారు. ఆయన గోత్రనామాలతో స్వామివారికి ప్రత్యేకంగా పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. వేదమంత్రాలతో ఆశీర్వచనం గావించి ఘనంగా సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలు వినియోగం గావించి ఆలయ చరిత్రను వివరించారు. కోదండరామస్వామిని సందర్శించుట నిమిత్తం ఆలయానికి వస్తున్న భక్తుల సౌకర్యార్థం నిర్విరామంగా మూడు పూటలా అన్నప్రసాదాలు పంపిణీ చేసే నిమిత్తం నూతనంగా ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కేంద్రాన్ని టీటీడీ చైర్మన్ శాస్త్రోక్తంగా అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభోత్సవం చేసి ఆయన స్వహస్తాలతో స్వయంగా భక్తులకు వడ్డించడం జరిగింది. అనంతరం ఆయన పాత్రికేయ సమావేశంలో మాట్లాడుతూ 2026 వ సంవత్సరం మార్చి 27వ తేదీ నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు టిటిడి ఆధ్వర్యంలో ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశాడు. భక్తులు అన్నప్రసాదాలను ఆరగించేందుకు సౌకర్యవంతంగా జర్మనీ షెడ్లతో కూడిన నిర్మాణాన్ని ఏర్పాటు చేశామన్నాడు. అనంతరం ఆయన సీతారామ కళ్యాణం నిర్వహించే వేదికను పరిశీలించాడు. కళ్యాణానికి వస్తున్న భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నాడు .భక్తుల ప్రవేశ,నిష్క్రమణ మార్గాల మధ్య భద్రతలను పెంచాలన్నాడు. అణువణువు పరిశీలించాలన్నాడు. అన్న, ప్రసాదాల, ముత్యాల, అక్షింతల పంపిణీ క్యూ లైన్ల వద్ద తోపుసులాట లేకుండా క్యూలైన్లను పటిష్టం చేయాలని ఆదేశించాడు. ఈ కార్యక్రమంలో అదనపు ఈవో వెంకయ్య చౌదరి, కడప జిల్లా కలెక్టర్ చెరుకూరి. శ్రీధర్, సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ సచ్కేత్ విశ్వనాథ్, టీటీడీ జేఈఈవో వీరబ్రహ్మం, తదితరులు ఉన్నారు.

## మత సామరస్యానికి చిహ్నం

# పవిత్ర రంజాన్ మాసం..



కడప కార్పొరేషన్ మార్చి 16 ప్రభాతవార్త:

ముస్లిం సోదరులకు పవిత్ర రంజాన్ మాస సందర్భంగా వైసిపి కువైట్ కన్వీనర్ ముమ్మడి బాలిరెడ్డి ఆధ్వర్యంలో కువైట్ మాలియా ప్రాంతములో సుమారు 500 మందికి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారనీ వైకాపా గల్ఫ్ కన్వీనర్ ఇలియాస్ బి.హెచ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాలిరెడ్డి మాట్లాడుతూ మైనారిటీల పట్ల మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డికి ఉన్న ప్రేమాభిమానాలను చాటుతూ, సర్వమత సమభావంతో అందరూ కలిసి ప్రార్థనలు నిర్వహించామన్నారు. అమెరికా, ఇజ్రాయిల్, ఇరాన్ యుద్ధ వాతావరణం గల్ఫ్ దేశాల్లో విపత్కర పరిస్థితి ఏర్పడిందని.. ఈ యుద్ధం త్వరగా పూర్తి ముగియాలని, అల్లాహ్ దయతో ప్రపంచవ్యాప్తంగా శాంతి నెలకొనాలని వార్తలు చేశామని తెలిపారు. గల్ఫ్ ప్రాంతంలోని ప్రవాసులందరూ ఈ రంజాన్ పండుగను సుఖసంతోషాలతో, ప్రశాంతంగా జరుపుకోవాలని మైనారిటీల సంక్షేమానికి కట్టుబడి ఉన్న జగనన్న ఆశయాలను కువైట్లో కూడా కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కువైట్ కమిటీ ముఖ్య నాయకులు సభ్యులు పాల్గొన్నారు.

# ప్రత్యేక అధికారి పాలనలోకి మున్సిపాలిటీ

- నేటితో మున్సిపల్ కమిటీ గడువు ముగింపు
- నేడు విందుతో కమిటీ సభ్యులకు వీడ్కోలు
- బీసీ రిజర్వేషన్ల ఆలస్యం కారణంగా ఎన్నికలకు విరామం
- సెప్టెంబర్లో మున్సిపల్ ఎన్నికలు జరిగే అవకాశం
- ప్రత్యేక అధికారి పాలనలో అభివృద్ధి కొనసాగుతుందా?

పులివెందుల, మార్చి 16, ప్రభాతవార్త :



పులివెందుల పట్టణ మున్సి పల్ కమిటీ గడువు నేటితో అధికారికంగా ముగియ నుంది. దీంతో మున్సిపాలిటీ ప్రత్యేక పరిపాలనలోకి వెళ్లనుంది. ప్రస్తుత కమిటీ 2021 మార్చి 3 వతేదిన అప్పటి ఎన్నికల అధికారి నుంచి ఎన్నిక పత్రాలు అందుకున్న వార్డు కౌన్సిలర్లు మార్చి 17 వ తేదీన కమిటీ ఏర్పాటు చేసుకొని ప్రమాణస్వీకారం చేశారు. ప్రస్తుత కమిటీ పాలన 5 సంవత్సరాల పదవీకాలం పూర్తికావడంతో ఇకపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో మున్సిపాలిటీ వ్యవహారాలు నిర్వహించబడనున్నాయి. మున్సిపల్ కమిటీ పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో నేడు కమిటీ సభ్యులు, అధికారులు, సిబ్బంది కలిసి ఒక విందు కార్యక్రమాన్ని నిర్వహించి కమిటీ సభ్యులకు వీడ్కోలు పలకనున్నారు. గత కొన్నేళ్లుగా మున్సిపల్ పాలనలో ప్రజలకు అందించిన సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకుంటూ సభ్యులు తమ అనుభవాలను పంచుకోను న్నారు.ప్రస్తుత కమిటీ ఏకగ్రీవంగా వైసీపీ దక్కించున్నది. వైసిపి పాలనలోనే నూతన కౌన్సెల్ సభా భవనం కూడా నిర్మించడం జరిగింది. ఇక మున్సిపల్ ఎన్నికలు తక్షణం జరిగే పరిస్థితి కనిపించడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్ల అంశం ఇంకా తేలకపోవడంతో ఎన్నికల ప్రక్రియ ఆలస్యం అవుతోంది. ఈ నేపథ్యంలో మరో ఆరు నెలల వరకు ఎన్నికలు జరగకపోవచ్చని సమాచారం. పరిస్థితులు అనుకూలిస్తే సెప్టెంబర్ నెలలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తు న్నాయి.ఈ క్రమంలో మున్సిపాలిటీపై ప్రత్యేక అధికారి పాలన అమలులోకి రానుంది. సాధారణంగా ప్రత్యేక పరిపాలనలో ప్రజాప్రతినిధుల భాగస్వా మ్యం తగ్గిపోవడంతో అభివృద్ధి పనులు నెమ్మదిం చవచ్చని కొందరు అభిప్రాయపడు తున్నారు. మరోవైపు అధికారులు సమర్థవంతంగా వ్యవహరిస్తే అభివృద్ధి పనులు కొనసాగుతాయని మరికొందరు ఆశాభావం వ్యక్తం చేస్తు న్నారు. పట్టణంలో తాగునీరు, పారిశుద్ధం, రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక వసతుల అభివృద్ధి పనులు కొనసాగుతాయా లేదా అన్నదానిపై ప్రజల్లో చర్చ సాగుతోంది. ప్రత్యేక అధికారి పాలనలో అయినా అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం కావాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.ఇక రానున్న మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రాజకీయ పార్టీలు కూడా ఇప్పటి నుంచే వ్యూహాలు రచిస్తున్నాయి. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించే వరకు ప్రత్యేక అధికారి పాలన కొనసాగనుంది. దీంతో పట్టణ మున్సిపల్ పాలనలో కొత్త దశ ప్రారంభమవుతోంది.

# ప్రజా సంక్షేమం తెలుగుదేశంతోనే సాధ్యం

రాజంపేట, మార్చి 16 ప్రభాతవార్త :

ప్రజా సంక్షేమం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు అన్నారు. గడపగడపకు తెలుగుదేశం పార్టీ కార్యక్రమంలో భాగంగా సోమవారం రాజంపేట పట్టణంలోని రామ్ నగర్ లో ఆయన పార్టీ నాయకులతో కలిసి పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రజల సాధక బాధలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగారు.ఇంటింటికి తిరుగుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని,అందిస్తున్న సంక్షేమ ఫలాలు గురించి చమర్తి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రం ప్రగతి బాటలో పయనిస్తుందని చెప్పారు. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రాధాన్యత ప్రకారం ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలియజేశారు.ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటున్నామన్నారు.గత వైకాపా పాలనలో ప్రజలుసంక్షోభాన్ని ఎదుర్కొన్నారని,నేడు కూటమి ప్రభుత్వ పాలనలో సంక్షేమాన్ని చూస్తున్నారని పేర్కొన్నారు.వార్డుల సందర్శనలో స్థానికులు డ్రైనేజ్,కరెంట్ పోల్స్ పలు రకాల సమస్యలను దృష్టికి తీసుకురాగా తక్షణమే స్పందిస్తూ మునిసిపల్,విద్యుత్ శాఖ అధికారులను పిలిపించి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు టి సంజీవరావు, రామ్ నగర్ నరసింహ, టి లక్ష్మీనారాయణ, కరీం, పూల నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



రాంనగర్లో ప్రజలతో మాట్లాడుతున్న జగన్మోహన్ రాజు

# పులివెందులలో ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షలు

పులివెందుల, మార్చి 16 , ప్రభాత వార్త :

పులివెందుల పట్టణంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ఉదయం 9:30 గంటలకు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షలు ప్రారంభం కావడంతో విద్యార్థులు ఉదయం నుంచే పరీక్షా కేంద్రాలకు చేరుకుని పరీక్షలకు హాజరయ్యారు. పులివెందుల పట్టణంలో మొత్తం 9 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా, ఈ కేంద్రాల్లో కలిపి 2044 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాస్తున్నారు. విద్యార్థులు పరీక్షలకు వెళ్లే సమయంలో వారి తల్లిదండ్రులు కూడా కేంద్రాల వద్దకు వచ్చి పిల్లలకు ధైర్యం చెప్పుతూ“ఆల్ ది బెస్ట్” చెబుతూ ప్రోత్సహించారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా 144 సెక్షన్ అమలు చేశారు.అలాగే పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు అధికారులు బందోబస్తు ఏర్పాటు చేసి భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా నిర్వహించారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు రాయడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి రామానాయుడు తెలిపారు.

## భక్తుల సహకారంతో పనులు ప్రారంభం..

బ్రహ్మంగారిమఠం మార్చి 16 ప్రభాతవార్త



జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి మఠంలో అన్నదాన సత్రం పక్కన జరుగుతున్న వంట గదులు స్టోరేజ్ రూమ్ పనులను శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం మఠాధిపతి శ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వామి వారు పరిశీలించారు. హైదరాబాద్ కు చెందిన శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి భక్తులను మఠాధిపతులు వారు సమాచారం చెరవేయగా వారు ముందుకు వచ్చి ఈ గదుల ను నిర్మాణం చేపడతామని అన్నారు. మఠాధిపతి అయిన మొట్టమొదటి మఠం అభివృద్ధిలో భాగంగా శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ ఈశ్వరయ్య చారి. మఠాదిపతి తమ్ముడు దత్తాత్రేయస్వామి ఉన్నారు.

## శ్రీ పొట్టి శ్రీరాములు జీవిత చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చాలి

ప్రొద్దుటూరు అర్బన్ మార్చి 16 ప్రభాతవార్త



పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా ఆర్యవైశ్య సభ ఆధ్వర్యంలో సోమవారం లైట్ పాలెం సెంటర్ లో గల శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుసెట్టి రామ్మోహన్రావు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు 58 రోజుల నిరాహార దీక్ష ఫలితంగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని, ఆ 58 రోజులకు గుర్తుగా 58 అడుగుల కాంస్య విగ్రహము రాజధాని అమరావతిలో నిర్మించడం ఆనందకరమన్నారు. పొట్టి శ్రీరాముల జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ను కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి మురికి నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శి మల్లెంకొండు ప్రతాప్, ఆర్యవైశ్య కార్యవర్గ సభ్యులు, ఆర్యవైశ్య మండల సంఘం, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ అవోపా మహిళా సభ్యులు పాల్గొన్నారు.

## మహా ప్రసాదంతో ముగిసిన ఆరాధన మహోత్సవాలు

బ్రహ్మంగారిమఠం మార్చి 16 ప్రభాతవార్త

మహిమాన్వితుడు మహాయోగి పొంగవుడైన శ్రీశ్రీశ్రీ అవధూత యోగీంద్ర నారాయణ రెడ్డి స్వామి 112 వ ఆరాధన మహోత్సవాలు సోమవారం మహా ప్రసాదం వినియోగంతో రెండు రోజులు పాటు జరిగిన ఆరాధన మహోత్సవాలు వైభవంగా ముగిశాయి. ఆదివారం రాత్రి స్వామివారి జెండా మెరవనితోపాటు, స్వామివారి గ్రామోత్సవం అంగరంగ వైభవంగా పెద్ద ఎత్తున తరలి వచ్చిన భక్తుల మధ్య నారాయణునికి స్వాములవారి గ్రామోత్సవం అద్భుతంగా జరిగినది. అదేవిధంగా అదేవిధంగా ఈ ఆరాధన మహోత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులందరికీ పెద్ద ఎత్తున మహాప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ ఉత్సవాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సబ్ ఇన్స్పెక్టర్ శివ ప్రసాద్ పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

## ప్రభుత్వాసుపత్రిని తనిఖీ చేసిన రాష్ట్ర క్వాలిటీ టీమ్

మైదుకూరు, మార్చి 16, ప్రభాతవార్త:



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్వాలిటీ టీమ్ – సభ్యులు మైదుకూరు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి సమగ్ర తనిఖీ నిర్వహించారు. ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రత, సిబ్బంది, సిబ్బంది పనితీరు, రికార్డుల నిర్వహణ, ఆపరేషన్ థియేటర్, ఎమర్జెన్సీ వార్డు, లేబర్ వార్డు, క్యాజువాల్టీ, ల్యాబొరేటరీ, బ్లడ్ స్టోరేజ్ సెంటర్, ఆర్కేఎస్కే తదితర విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ తనిఖీ బృందంలో జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జనార్ధన్ మరియు వినయ్ పాల్గొని ఆసుపత్రి సేవల నాణ్యత, నిర్వహణ ప్రమాణాలను సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ జ్యోత్స్నారెడ్డి, వైద్యులు భారతి రెడ్డి, గాయత్రి, నాగయ్య, కరీముల్లా, శివ కుమార్, అంజని సౌమ్య గార్లతో పాటు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## మెరుగైన విద్యకు వైవియూ సరోవరం..

వేంపల్లె:మార్చి 16(ప్రభాత వార్త )



మెరుగైన ఉన్నత విద్యకు యోగి వేమన యూనివర్సిటీ(వైవియూ) ఒక సరోవరం వంటిదని ప్రొఫెసర్ డా.ఈశ్వర్ రెడ్డి వెల్లడించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటైన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వెనుకబడిన గ్రామీణ ప్రాంతాల యువతను దృష్టిలో ఉంచుకుని అందరికీ అందుబాటులో ఉండేలా వైవియూ ని ఏర్పాటు చేశారన్నారు. సెల్ఫోన్, సోషల్ మీడియా, ప్రేమ పేరుతో జరిగే ఆకర్షణలు జీవిత లక్ష్యాలను నీరుగార్చుతాయని, విలువైన సమయాన్ని లక్యసాధనకు సద్వినియోగ పరుచుకోవాలని కోరారు. ప్రిన్సిపాల్ నాగేంద్ర, అధ్యాపకులు గంగాధర్, నాగలక్ష్మిదేవి, మాధవ రావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలు, మొబైల్ దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన

వేంపల్లె మార్చి 16 (ప్రభాత వార్త)



పట్టణంలోని శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో విద్యార్థుల్లో మంచి అలవాట్లు పెంపొందించేందుకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మై భారత్ మరియు నిఘమా ఫౌండేషన్ వారి సహకారంతో సంయుక్త ఆధ్వర్యంలో"పరివర్తన" కార్యక్రమం భాగంగా మాదకద్రవ్యాలు మరియు మొబైల్ ఫోన్ వలన కలిగే దుష్ప్రభావాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ బి. చక్రపాణి రెడ్డి మాట్లాడుతూ యువత సరదాగా ప్రారంభించే మాదక ద్రవ్యాల అలవాటు, అలాగే అధిక మొబైల్ వినియోగం చివరికి వ్యసనంగా మారి వారి భవిష్యత్తును దెబ్బతీస్తుందని తెలిపారు. విద్యార్థులు తమ లక్ష్యాలపై దృష్టి పెట్టి క్రమశిక్షణతో చదువుకుంటే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని చెప్పారు. మొబైల్ ఫోన్ను చదువు మరియు అవసరాలకు మాత్రమే పరిమితం చేసి సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మంచి ఆలోచనలు, మంచి స్నేహాలు మరియు కష్టపడి చదివే అలవాటు విద్యార్థులను గొప్ప స్థాయికి తీసుకెళ్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మై భారత్ సమన్వయకర్త సోమల వెంకటేష్, సుబ్బయ్య, పాఠశాల విద్యార్థులు మరియు ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## యాజమాన్య పద్ధతులుపై అవగాహన సదస్సు,

మైదుకూరు, మార్చి 16, ప్రభాతవార్త:

ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో పసుపు సాగు లో మేలైన యాజమాన్య పద్ధతులు, సస్య రక్షణ, పంట కోత మరియు కోత అనంతర నిర్వహణ పై అవగాహన సదస్సు 18.03.2026 వ తేదీన మైదుకూరు మండలంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు ఏర్పాటు చేయటం జరుగును. ఉదయం 10:00 గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుంది. ఈ కార్యక్రమమునకు ఉద్యాన శాస్త్రవేత్తలు, కడప జిల్లా ఉద్యాన అధికారి, మైదుకూరు ఉద్యాన అధికారి హాజరు అవుతారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు నియోజయక వర్గ రైతులు విరివిరిగా పాల్గొని జయప్రదం చేయవలసినదిగా కోరడమైనది.

## మహాపురుషుడు పొట్టి శ్రీరాములు



వేంపల్లె:మార్చి 16(ప్రభాత వార్త )

ఆంధ్రులకు ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర సాధనకు 58 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి, ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు మహాపురుషుడు అని అవోపా అధ్యక్షుడు బైరిశెట్టి సునీల్ కుమార్ అన్నారు. సోమవారం అమరజీవి 125వ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బైరిశెట్టి సునీల్ మాట్లాడుతూ అమరజీవి ప్రాణత్యాగానికి చిహ్నంగా రాష్ట్ర ప్రభుత్వం 58 అడుగుల కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించడం ఎంతో గర్వకారణం అన్నారు. ఆర్యవైశ్య ముద్దుబిడ్డ పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం అపూర్వం, ఆయన సేవలు ఎనలేనివని కొనియాడారు. దేశానికి జాతిపిత మహాత్మాగాంధీ అయితే ఆంధ్రరాష్ట్ర తెలుగు ప్రజలకు పొట్టి శ్రీరాములు తెలుగు జాతిపిత అని అన్నారు. ఆర్యవైశ్య అధ్యక్షుడు టి.చంద్రశేఖర్, అవోపా మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు బిజిఎస్ నాగలక్ష్మి, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ సందర్భంగా..పేదలకు చీరలు పంపిణీ

వేంపల్లె:మార్చి 16(ప్రభాత వార్త )



రంజాన్ మాసం సందర్భంగా..పేదలకు చీరలు పంపిణీ చేసినట్లు టిడిపి మైనార్టీ కన్వీనర్ తెలంగాణ వలి అన్నారు. సోమవారం పులివెందుల జడ్పీటీసీ సభ్యురాలు మారెడ్డి లతారెడ్డి చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టారు. అలాగే టిడిపి వేంపల్లె మండల ఇంచార్జ్ రఘునాథ్ రెడ్డి చేతుల మీదుగా సిఎం రిలీఫ్ ఫండ్ చెక్ ని బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమమే లక్ష్యంగా పాలన అందిస్తుందని, ఏపి సిఎం చంద్రబాబు నైతృత్వంలో రాష్ట్రం ప్రగతి వైపు నడుస్తోందన్నారు. అలాగే మైనార్టీ కన్వీనర్ తెలంగాణ వలి ఆధ్వర్యంలో పేదలకు చీరలు పంపిణీ అభినందనీయం అని కొనియాడారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం సంతోషదగ విషయమన్నారు. టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఉపాధ్యక్షుడు వీరభద్ర, పట్టణ అధ్యక్షుడు నామా వేమా, మైనార్టీ నేతలు ఫయాజ్, మహమ్మద్, పీరా సాహెబ్, జబిబుల్లా, నాయకులు డక్కా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు బట్టలు పంపిణీ

వేంపల్లె:మార్చి 16(ప్రభాత వార్త )



స్థానిక పంచాయతీ కార్యాలయంలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ బట్టలు పంపిణీ చేశారు. రంజాన్ పండుగను పురస్కరించుకొని సోమవారం టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ ఆధ్వర్యంలో బట్టలు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ మేరకు పంచాయతీ కార్యాలయంలో పని చేస్తున్న కార్మికులు అందరికి మహిళాలకు చీరలు, మగ వారికి షర్ట్, ప్యాంట్ ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టిడిపి నేత షబ్బీర్ మాట్లాడుతూ ప్రతి ఎడాది లాగే ఈ ఎడాది కూడ రంజాన్ పండుగను పురస్కరించుకుని 60 మందికి పారిశుద్ధ్య కార్మికులకు, పేదలకు బట్టలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా పార్లమెంట్ ఉపాధ్యక్షుడు రామ గంగిరెడ్డి, దేవర్ల చంద్రశేఖర్ రెడ్డి, తెలుగు యువత మండల ఉపాధ్యక్షుడు గంగధర్ రెడ్డి, టిడిపి నేతలు మహబూబ్ షరీఫ్, షోహేల్, టిడిపి నేతలు పాల్గొన్నారు.

## అమరజీవి కీ నివాళులు

వేంపల్లె:మార్చి 16(ప్రభాత వార్త )



ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర సాధనకు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణ త్యాగం చేసిన అమర జీవి పొట్టి శ్రీరాములు కీ ఘనంగా నివాళులర్పించినట్లు గ్రంధాలయ అధికారిణి వనజ కుమారి అన్నారు. సోమవారం స్థానిక గ్రంధాలయ శాఖ ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాల వేసి నమస్కరించుకున్నారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం ఆయన చేసిన త్యాగం చిరస్మరణీయం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

## పంచ సూత్రాల గురించి రైతులకు అవగాహన

కలసపాడు, మార్చి 16 ప్రభాతవార్త:



మండలంలోని చింతలపల్లి , లింగారెడ్డిపల్లి గ్రామాల్లో రైతన్న మీ కోసం కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారి విజయ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం మాట్లాడుతూ గ్రామ రైతులతో కలసి రైతన్న మీ కోసం కరపత్రాలు ను ఆవిష్కరించారు. తదుపరి రైతన్న మీ కోసం కార్యక్రమం గురించి రైతులకు అవగాహన కల్పించారు. రైతన్న మీ కోసం కార్యక్రమంలో రూపొందించిన 5 పంచ సూత్రాల గురించి వివరించారు. ఎలినినో ప్రభావం గురించి రైతులకు అవగాహన కల్పించి అందుకు తగ్గట్లు ప్రణాళిక చేసుకుని పియండీఎస్ పద్ధతులను పాటించాలని తెలిపారు. తదుపరి యూరియా వాడకం గురించి రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ పథకాల గురించి అవగాహన కల్పించారు. పొలం కలిగి ఉన్న ప్రతి రైతు ఎపి యాప్ ఆర్ పోర్టల్ లో రైతు రిజిస్ట్రేషన్ చేసుకుని విశిష్ట గుర్తింపు సంఖ్య ఐడి ని పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు మురళీధర్ రెడ్డి, స్టేట్ రోడ్ డెవలప్మెంట్ డైరెక్టర్ రంతు,గ్రామ గ్రామ వ్యవసాయ సిబ్బంది సునీల్ కుమార్ , దేవి ప్రియ, సుస్మిత, మరియు ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ శ్రీలక్ష్మి మరియు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

### వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రానికి

## రూ.10 కోట్లు కేటాయించాలి.

మైదుకూరు, మార్చి 16, ప్రభాతవార్త:

సీనియర్ బిజెపి నాయకుడు బి.పి ప్రతాప్ రెడ్డి ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో కడప జిల్లా కలెక్టర్ గారికి వినిపిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాయలసీమ హార్టికల్చర్ హబ్ అభివృద్ధి కి సంబంధించి 1. మైదుకూరు శాసనసభ నియోజకవర్గం పరిధిలో ఉన్న ఆకుకూరలు, కూరగాయలు, పూల పెంపకం అభివృద్ధి పైన దృష్టి సారించాలి. 2.వైయస్సార్ కడప జిల్లాలో విస్తారంగా ఉన్న చీని నిమ్మ, బత్తాయి తోటల సంరక్షణకు ప్రత్యేక నిపుణుల బృందం ఏర్పాటు చేయాలి.ఒక పంటకాల వ్యవధిలో చెట్ల పరిరక్షణ పైన దృష్టి పెట్టి చీడపీడల బారిన పడకుండా సంరక్షణ చెయ్యవలెను. బత్తాయి తోటలు కేవలం రాయలసీమ ప్రాంతంలో మాత్రమే న్నవి. ఐసీఏఆర్, ఉద్యానవన శాఖ, ఉద్యానవన విశ్వవిద్యాలయం వారిని సమిష్టి బాధ్యత గా పనులు చెపట్టాలి. 3.ఎన్ హెచ్ ఆర్ డి ఎఫ్(ఉల్లి పరిశోధన సంస్థ) సంస్థకు రూ.20 కోట్ల రూపాయల నిధిని కేటాయించాలి. 4.వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రానికి రూ.10 కోట్లు కేటాయించి మరింత పరిశోధనలతో రైతులకు ఉపయోగపడేలా నిధుల కేటాయించాలని కోరినట్లు తెలిపారు.

## నిరాధార ఆరోపణలు చేయడం సునీతమ్మకు తగదు

ప్రొద్దుటూరు మార్చి 16 ప్రభాతవార్త



మాజీ మంత్రి వైయస్ వివేకానంద రెడ్డి కేసులో నిరాధారమైన ఆరోపణలు చేయడం వైయస్ సునీతమ్మకు తగదని మాజీ ఎమ్మెల్యే వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు రాజకీయ కుట్రలో సునీతమ్మ పావుగా మారిందని అన్నారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసుకు సంబంధించి సీబీఐ దర్యాప్తు ముగిసిందని చార్జిషీట్ కూడా దాఖలు చేశారన్నారు. ఇందులో ప్రత్యేకంగా ముద్దాయిలను చేర్చాల్సిన అవసరం లేదని కూడా పేర్కొన్నారని తెలిపారు. వివేక హత్య జరిగి ఏడేళ్లు అయినా చంద్రబాబు రాజకీ కుట్రలు ఆగడం లేదని విమర్శించారు. వివేకానందరెడ్డిని హత్య ఎవరు చేశారు, ఎవరు చేయించారు, ఎందుకు చేయించారు అనేదానిపైనే ప్రధానంగా చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ప్రకారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కుటుంబానికి వివేకాను హత్య చేయించాల్సిన అవసరం ఏమైనా ఉందా అని ప్రశ్నించారు. కేవలం జగన్ న్ను ఇరికించడానికి పచ్చ మీడియా ద్వారా అభూత కల్పనలు కల్పించారన్నారు. వివేకానందరెడ్డి హత్య కేసుకు సంబంధించి ఎంపీ వైఎస్ అవినాష్రెడ్డి ప్రమేయం ఉందని కొన్ని పత్రికలు ప్రధానంగా ప్రచురింపచేశారని రాచమల్లు తెలిపారు. వివేకాకు ముస్లిం మహిళతో సంబంధం ఉందని, ఆమెకు ఒక కుమారుడు కూడా ఉన్నట్లు బయటి ప్రపంచానికి తెలిసిందన్నారు. ఆర్థిక లావాదేవీలకు సంబంధించి వివేకాను హత్య చేసి ఉండొచ్చు కదా అని ప్రశ్నించారు. ఈ దిశగా సీబీఐ విచారణ చేపట్టడం లేదన్నారు. ఈ కేసులోఅప్రూవర్గా మారిన వ్యక్తి స్టేట్మెంట్ కూడా ఇచ్చారన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే ఈ హత్య జరిగిందని, ఆధారాలుంటే జగన్ ను అప్పుడే కేసులో ఇరికించేవారన్నారు. వివేక హత్య అనంతరం ఆయన బావమరిది అవినాష్రెడ్డికి సమాచారం ఇచ్చారని తెలిపారు. జగన్, భారతమ్మలను కేసులో చేర్చే వరకు సునీతమ్మ మనసు కుదుటపడేటట్లు లేదన్నారు. ఆమె మనసులో చంద్రబాబు వటవృక్షం నాటారని తెలిపారు. సునీతమ్మ ఈ కేసుపై సుప్రీంకోర్టును పలు సందర్భాల్లో ఇంకా సీబీఐ విచారించాలని ఆశ్రయించిందన్నారు. సీబీఐ విచారించాల్సి ఏమి లేదని సుప్రీంకోర్టుకు తెలిపిందని చెప్పారు. కేసు ట్రయల్ జరుగుతుండగా ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం తగదని రాచమల్లు అన్నారు. తమ కుటుంబాన్ని బజారుకు ఈడ్చకూడదన్న ఉద్దేశంతోనే జగన్ ఈ కేసు పై మాట్లాడకుండా ఉన్నతంగా ఆలోచిస్తున్నారన్నారు.

## డాబాను తొలగించాలి

దువ్వూరు, మార్చి 16, ప్రభాతవార్త:



మండల కేంద్రమైన దువ్వూరులో జాతీయ రహదారి పక్కన అలాగే కడపకర్నూలు జాతీయ రహదారి రోడ్డు ప్రక్కన ఉన్న డాబాను తొలగించాలని సోమవారం దువ్వూరుకు చెందిన వ్యక్తులు తహసిల్దార్ సంజీవరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఆ వినతిపత్రంలో జాతీయ రహదారి ప్రక్కన ప్రభుత్వానికి సంబంధించిన భూమిలో డాబా వేసుకొని ఉన్నారని దానివల్ల వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతుందని, తరచూ రోడ్డు ప్రమాదాలు కూడా జరిగే అవకాశం ఉందని అందువల్ల ఆ డాబాను తొలగించాలని కోరారు. అక్రమంగా ప్రభుత్వ స్థలంలో ఉన్న డాబాను తొలగించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో దువ్వూరుకు చెందిన శ్రీను, విజయ్, ఆశీర్వాదంలు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా నిర్వహించిన 10వ తరగతి పరీక్షలు

సుండుపల్లె ,మార్చి 16,ప్రభాతవార్త :

మండల కేంద్రంలో సోమవారం 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించబడ్డాయి. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 252 మంది విద్యార్థులకు గాను 251 మంది హాజరయ్యారు. ఒకరు గైర్హాజరయ్యారు. అలాగే మడితాడు పంచాయతీ పరిధిలోని గుట్ట కిందరాచపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 222 మంది విద్యార్థులకు గాను 216 మంది విద్యార్థులు హాజరై, 6 మంది గైర్హాజరయ్యారని మండల విద్యాశాఖ అధికారి వెంకటేష్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు.పరీక్షా కేంద్రాల వద్ద శాంతి భద్రతల కోసం 144 సెక్షన్ అమలు చేసినట్లు సుండుపల్లె ఎస్సై హుస్సేన్ తెలిపారు.

## అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘన నివాళులు

### అర్పించిన జడ్పీటీసీ మారెడ్డి లతా రెడ్డి

పులివెందుల, మార్చి 16, ప్రభాత వార్త :

అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా పులివెందుల పట్టణంలోని పూల అంగళ్ల కూడలి వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పులివెందుల జడ్పీటీసీ మారెడ్డి లతారెడ్డి స్థానిక టీడీపీ నేతలతో కలసి పూల మాలలు వేసి భక్తిశ్రద్ధలతో అంజలి ఘటించారు.ఈ సందర్భంగా జడ్పీటీసీ మారెడ్డి లతారెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం తెలుగు జాతి చరిత్రలో చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన చేసిన నిరాహార దీక్ష, ప్రాణత్యాగం ఫలితంగానే ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమరజీవి సేవలను స్మరించుకున్నారు. తెలుగు జాతి ఉన్నంతకాలం పొట్టి శ్రీరాములు త్యాగం అజరామరంగా నిలుస్తుందని నాయకులు పేర్కొన్నారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం ఆయన చేసిన పోరాటం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిగా నిలుస్తుందని, ఆయన ఆశయాలను కొనసాగించేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం అమర్నాథ్ యాదవ్, పట్టణ అధ్యక్షులు కొరియర్ ప్రసాద్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తూగుట్ల మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర వాణిజ్య విభాగపు కార్యదర్శి నల్లగారి భాస్కర్ రెడ్డి తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం

### టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్మోహన్ రాజు



పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేస్తున్న జగన్మోహన్ రాజు

రాజంపేట, మార్చి16 ప్రభాతవార్త:

ప్రత్యేక రాష్ట్రం కోసం అసువులు బాసిన త్యాగధనుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని టిడిపి అసెంబ్లీ ఇంచార్జ్ జగన్మోహన్ రాజు అన్నారు. 125వ జయంతి సందర్భంగా సోమవారం జగన్మోహన్ రాజు స్థానిక ప్రధాని రహదారిలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం నాయకులు, తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి నిలువెత్తు పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజల గుండెలపై చెరగని ముద్రవేశారని కొనియాడారు. అందుకే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పొట్టి శ్రీరాములు స్మారక చిహ్నంగా రాష్ట్రం కోసం 58 రోజుల పాటు దీక్షలు చేసిన చరిత్రను దృష్టిలో ఉంచుకుని 58 అడుగుల స్మారక విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఘన నివాళులు అర్పించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు పాల ప్రకాష్ , ఆంజనేయ స్వామి ఆలయ చైర్మన్ తలిశెట్టి రమేష్, పబ్బిశెట్టి శెట్టి సుబ్రమణ్యం, ఆర్యవైశ్య సంఘం నాయకులు వాకాటి గోపాల్, కర్ణాటక సుబ్రమణ్యం, సూరయ్య శ్రీనివాసులు, రాజంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ గన్నే సుబ్బనరసయ్య నాయుడు, డిఆర్ఎల్ మనీ, టి.సంజీవరావు,గుగ్గిళ్ల చంద్రమోళి, మనుబోలు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దువ్వూరు, మార్చి 16, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన దువ్వూరులో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని డిఈ రాజకుమార్ తెలిపారు. దువ్వూరు సబ్ స్టేషన్ పరిధిలో 33/11కేవీ అలాగే 13కేవి లైన్ లలో మరమ్మత్తులు నేడు చేపడుతున్నామని అందువల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించవలసిందిగా కోరారు.

## అమరజీవి పొట్టి శ్రీరాములు ఘన నివాళులు

పులివెందుల, మార్చి 16 , ప్రభాత వార్త :

పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా పులివెందులలో ఆయన విగ్రహానికి మున్సిపల్ ఇంచార్జ్ వైఎస్ మనోహర్ రెడ్డి , ఆర్యవైశ్య సంఘ నాయకులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పొట్టి శ్రీరాములకు ఘన నివాళులు అర్పించారు. సోమవారం స్థానిక పూలంగళ్ళ సెంటర్ వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి వైయస్ మనోహర్ రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సంద ర్భంగా వైయస్ మనోహర్ రెడ్డి మాట్లాడుతూ తెలుగు ప్రజల స్వీయ గౌరవం కోసం, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం సాధన కోసం పొట్టి శ్రీరాములు చేసిన నిరాహార దీక్ష దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందని నాయకులు పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితంగానే ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని, ఆయన దేశభక్తి, త్యాగస్ఫూర్తి నేటి తరాలకు ఆదర్శమని ఈ సందర్భంగా వారు అన్నారు. యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ , రాష్ట్ర సివిల్ సప్లై మాజీ డైరెక్టర్ హాల్ గంగాధర్ రెడ్డి, కౌన్సిలర్లు పార్నపల్లి కిషోర్, నూర్ భాషా సంఘం అధ్యక్షులు ఓతూరు రసూల్ , బలిజ సంఘం నాయకుల కొంగనపల్లి మురళి మోహన్, మాజీ అంకాలమ్మ దేవస్థానం చైర్మన్ బ్యాటరీ ప్రసాద్, రాష్ట్ర సోషల్ మీడియా జాయింట్ సెక్రటరీ కొంగనపల్లి విజయ్ కుమార్,హరి , సోఫాల వీర,ఆర్యవైశ్య సంఘం సభ్యులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతన్నా మీకోసం" కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేయాలి



కడప, మార్చి 16 ప్రభాత వార్త :

రెవెన్యూ సమస్యల పరిష్కార ప్రాధాన్యత తోపాటు.. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసే దిశగా.. చేపట్టిన "రైతన్నా మీకోసం" కార్యక్రమాన్ని జిల్లాలో ప్రతిష్టాత్మకంగా అమలు చేయాలని జేసీ డా. నిధి మీనా సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ లోని సభా భవన్ హాలులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమానికి జేసీ డా. నిధి మీనా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సందర్భంగా పిజిఆర్ఎస్ కార్యక్రమానికి హాజరైన అధికారులతో జేసీ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పిజిఆర్ఎస్ వ్యవస్థ ద్వారా అర్జీదారులకు సంతృప్తి కరమైన, నాణ్యమైన వేగవంతమైన పరిష్కారాన్ని అందిస్తోందన్నారు. ప్రభుత్వ ఆశయానికి కట్టుబడి ప్రతి శాఖ జిల్లా అధికారితో పాటు ఆయా శాఖల మండల స్థాయి అధికారి వరకు ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. భూ వివాదాల శాశ్వత, సమగ్ర పరిష్కారానికి పిజిఆర్ఎస్ సేవలతో పాటు ఏర్పాటు చేసిన రెవెన్యూ క్లినిక్స్ ప్రత్యేక కౌంటర్ల ద్వారా జిల్లా నలు మూలల నుండి వచ్చిన పలువురు అర్జీలను రెవెన్యూ అధికారులు స్వీకరించి.. సత్వర పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నారన్నారు.

ఈ నెల 16 వ తేదీ నుండి ఈ నెల 25 వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాముఖ్యతతో నిర్వహిస్తున్న "రైతన్నా మీకోసం" వారోత్సవాలను జిల్లాలో అత్యంత ప్రాధాన్యతతో అమలు చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని రైతు సేవా కేంద్రాలలో వ్యవసాయ అనుబంధ రంగాలకు చెందిన అన్ని శాఖలు సమన్వయంతో విజయవంతం చేయాలన్నారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసే దిశగా, రైతుల సమస్యలను నేరుగా తెలుసుకోవడానికి ఈ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో ప్రతిష్టాత్మకంగా చేయడం జరుగుతోందన్నారు.

## ఎవరి ప్రయోజనాల కోసం సునీత పోరాటం?

పులివెందుల మార్చి 16 ప్రభాత వార్త :

మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు అంశంపై రాజకీయ ఆరోపణలు చేయడం మానుకోవాలని, నరేడ్డి సునీత ఎవరికోసం పోరాటం చేస్తోందని వైఎస్ కుటుంబంపై బురద చల్లే ప్రయత్నాలను నిలిపివేయాలని మహిళా కౌన్సిలర్లు లక్ష్మీ ప్రసన్న, శ్యామల, కాంతమ్మ, రజియా భేగం లు నరేడ్డి సునీతపై తీవ్ర విమర్శలు చేశారు. పట్టణంలోని స్థానిక ఎసిబి కార్యాలయం నందు సోమవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ వివేకా కేసు దర్యాప్తు ప్రక్రియలో ఇప్పటికే సీబీఐ దర్యాప్తు జరిగిందని, సుప్రీంకోర్టులో కూడా వాదనలు వినిపించిన తర్వాత అవినాష్ రెడ్డి పై ఉన్న ఆరోపణలు నిలబడలేదని తెలిపారు. ఎలాంటి తప్పు చేయని వ్యక్తి అయిన అవినాష్ రెడ్డి కడిగిన ముత్యంలా బయటకు వచ్చారని వారు పేర్కొన్నారు. వివేకా రాసిన లెటర్ దాచిపెట్టింది మీ వెనుక నుండి నడిపించే చంద్రబాబు కోసమా లేక మీ భర్త ను కాపాడటం కోసమా అని ప్రశ్నించారు.వివేకా హత్య కేసును సీబీఐకి అప్పగించాలని మొదట డిమాండ్ చేసిన వారు సునీత రెడ్డేనని, అదే విధంగా కేసును ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు బదిలీ చేయించుకోవడంలో కూడా ఆమె పాత్ర ఉందని వారు గుర్తు చేశారు. కేసు విచారణ అధికారిగా వచ్చిన రాంసింగ్ను కూడా స్వాగతించినది ఆమెనేనని పేర్కొన్నారు. అంతేకాకుండా దేశంలోనే ప్రముఖ న్యాయవాది అయిన లుద్రా ద్వారా వాదనలు వినిపించారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడును గత రెండేళ్లలో పలుమార్లు కలిసిన విషయం కూడా ప్రజలకు తెలిసిందేనని వ్యాఖ్యా నించారు. ఈ నేపథ్యంలో సీబీఐ ఇప్పటికే ఛార్జ్షీట్ దాఖలు చేసిన తర్వాత ఈ కేసులో సంబంధం లేని వైఎస్ భారతి పేరును ప్రస్తావించడం వెనుక ఉద్దేశ్యం ఏమిటో ప్రజలకు అర్థమవుతోందని వారు అన్నారు.అదేవిధంగా రాజకీయంగా ఓటమి చెందిన బీటెక్ రవిని ఇంటికి పిలిచి ప్రెస్ మీట్ నిర్వహించడం వెనుక ఉన్న కారణాలపై కూడా ప్రశ్నలు తలెత్తుతు న్నాయని పేర్కొన్నారు. రాజకీయ కుట్రల కోణంలో ఈ వ్యవహారం సాగుతోందని వారు ఆరోపించారు. ఇకనైనా దర్యాప్తు సంస్థలు వెల్లడించిన వాస్తవాలను గుర్తించి అనవసర ఆరోపణలు చేయడం మానుకోవాలని వారు సూచించారు.



# రైతన్న మీ కోసం కార్యక్రమంలో రైతులకు అవగాహన




**ముద్దనూరు, మార్చి16 ప్రభాతవార్త:**
మండలంలోని కొత్తపల్లె మరియు కె తిమ్మాపురం గ్రామాల్లో రైతన్న మీ కోసం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ రైతులతో కలసి రైతన్న మీ కోసం కరపత్రాలు ను ఆవిష్కరించారు. తదుపరి రైతన్న మీ కోసం కార్యక్రమము గురించి రైతులకు అవగాహన కల్పించారు. రైతన్న మీ కోసం కార్యక్రమంలో రూపొందించిన 5 పంచ సూత్రాల గురించి వివరించారు. ఎలినినో ప్రభావం గురించి రైతులకు అవగాహన కల్పించి అందుకు తగ్గట్లు ప్రణాళిక చేసుకుని పియండీఎస్ పద్ధతులను పాటించాలని తెలిపారు. తదుపరి యూరియా వాడకం గురించి గోడ పత్రాలను ఆవిష్కరించి రైతులకు అవగాహన కల్పించారు. తదుపరి కె తిమ్మాపురం గ్రామంలో రైతన్న మీ కోసం కార్యక్రమంలో పాల్గొని వ్యవసాయ పథకాల గురించి అవగాహన కల్పించారు. పొలం కలిగి ఉన్న ప్రతి రైతు ఎపి యాప్ ఆర్ పోర్టల్ లో రైతు రిజిస్ట్రేషన్ చేసుకుని విశిష్ట గుర్తింపు సంఖ్య ఐడి ని పొందాలి అన్నారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ సొసైటీ ఛైర్మెన్ ఆర్. సురేంద్ర నాథ్ రెడ్డి, మోహన్ రెడ్డి, గ్రామ సచివాలయ సిబ్బంది సుచరిత, సందీప్, శేఖర్, మాధవి, శివ, పకృతి వ్యవసాయ సిబ్బంది రామసుధ మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా పొట్టిశ్రీరాములు జయంతి వేడుకలు



**ముద్దనూరు, మార్చి 16, ప్రభాతవార్త :**
ముద్దనూరు మండలం స్థానిక వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహనీయుడు శ్రీ పొట్టి శ్రీరాములు 125 వ జయంతి సందర్భంగా మండల అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన మహాపురుషుడు అని కొనియాడారు. ఈ కార్యక్రమం లో మండల కో ఆప్షన్ మెంబర్ ఖదీర్ భాషా, నర్రెడ్డి జగదీశ్వర్ రెడ్డి, శ్రీనివాసులు, ప్రతాప్ రెడ్డి, వెంకటేష్, సూర్యముని రెడ్డి, అగుడూరు రమేష్, వరకుమార్, వెంకట స్వామి తదితరులు పాల్గొన్నారు.

## బెస్తవీధిలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం



**పోరుమామిళ్ల రూరల్, మార్చి 16ప్రభాత వార్త :**
బద్వేల్ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, బద్వేల్ టిడిపి ఇన్చార్జి రితీష్ రెడ్డి ఆదేశాల మేరకు పోరుమామిళ్ల బెస్తవీధి లో రూ. 11లక్షలు మంజురైనా సీసీ రోడ్డు ప్రారంభించిన కూటమి అభ్యర్థి బొజ్జ రోషన్న, రోడ్డు డెవలప్మెంట్ డైరెక్టర్ సాధనకరి రంతు, టెంకాయ కొట్టి రోడ్డు పనులను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ వీధిలో సరైన రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నాడంతో ప్రజల విన్నపం మేరకు నూతన రోడ్డును ఏర్పాటు చేశామని వారు అన్నారు. ప్రజల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రొఫెసర్ భాష, గాలి మురళి, సీత సురేష్, మేడిశెట్టి వెంకటేశ్వర్లు, రైస్ మిల్ రమణ, ఒరుగండి నాగరాజు, శంకర్ రెడ్డి, మోలాలి టిడిపి కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## శ్రీ బద్దెన కళా పీఠం ఆధ్వర్యంలో పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలు.

**బద్వేల్ అర్బన్ మార్చి 16 ప్రభాతవార్త :**




శ్రీ బద్దెన కళా పీఠం ఆధ్వర్యంలో పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలను వైభవంగా నిర్వహించడం జరుగుతుందని బద్దెన కళా పీఠం సభ్యులు పలువురు తెలిపారు, ఈ సందర్భంగా బద్దెన కళా పిటం కమిటీ సభ్యులు మాట్లాడుతూ స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 19 వతేది గురువారం సాయంకాలం 5:30 నుండి శ్రీ బద్దెన కళా పీఠం ఆధ్వర్యంలో తెలుగు సంవత్సరాది వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామమన్నారు సాయంత్రం 6 గంటలకు బ్రహ్మశ్రీ కనుమల్ల సత్యనారాయణ శర్మ గారిచే పంచాంగ శ్రవణం, అనంతరం సభా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మైదుకూరు డిఎస్పి శ్రీ రాజేంద్ర ప్రసాద్, సీనియర్ న్యాయవాది పివిఎన్ ప్రసాద్ హాజరవుతున్నారు. ఉగాది పురస్కారాలను సంగీత పురస్కారాన్ని శ్రీరూపరాజు ఉమామహేశ్వరరావు గారికి( బద్వేలు) (తబల), శ్రీమతి బండి మల్లికా గారికి (ప్రొద్దుటూరు), కోలాటం (నృత్యం), శ్రీ పుత్త సుబ్రహ్మణ్యం గారికి సామాజిక సేవ (మానవత), అందిస్తున్నాము. ప్రభుత్వ ఉన్న పాఠశాలలో చదివిన ప్రతిభావంతులైన విద్యార్థినీ, విద్యార్థులకు మున్సిపాలిటీ పరిధిలో ప్రతిభా పుష్కాలను ఇస్తున్నాం. తదుపరి ప్రముఖ గాయని గాయకులచే సంగీత విభావరి కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నాం. సాంప్రదాయ రీతిలో మైదుకూరు రోడ్డు లోని ఆర్ అండ్ బంగళా వద్ద నుండి ఊరేగింపుగా బాలుర ఉన్నత పాఠశాల వద్దకు భజంత్రీలతో పురస్కార గ్రహీతలను, అతిథులను తీసుకెళ్తాం. సంగీత, సాహిత్య అభిమానులు పట్టణ మరియు పరిసర గ్రామాల ప్రజలు విరివిగా పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

## అమరజీవి శీరాములు జయంతి వేడుకలు



**తొండూరు మార్చి 16 ప్రభాతవార్త :**
స్థానిక తొండూరు గ్రంథాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు గ్రంథాలయ అధికారిణి ఎస్. స్వరూపారాణి సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్వరూప రాణి మాట్లాడుతూ మద్రాసు కేంద్రంగా తమిళులతో కలిసి ఉండే ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం సాధించడం ద్వారా ఆయన తెలుగు వారి హృదయాల్లో అమరజీవిగా నిలిచిపోయారన్నారు. మద్రాస్ రాష్ట్రంలో తెలుగువారికి జరుగుతున్న అన్యాయాన్ని సహించలేక ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర కోసం 54 రోజులు నిరాహార దీక్ష చేసి 1952 డిసెంబర్ 15 మరణించారన్నారు. ఈయన దీక్ష ఫలితంగా నవంబర్ 1 ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందన్నారు. ఆయన పోరాటం ప్రపంచానికి స్ఫూర్తిగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు



**చాపాడు, మార్చి 16. ప్రభాతవార్త :**
అమరజీవిగాప్రజల హృదయాలలో నిలిచిపోయిన గొప్ప మహనీయుడు పొట్టి శ్రీరాములు అని వెలుగు ఏపిఎం శ్రీధర్ తెలిపారు. చాపాడు గ్రంథాలయము నందు సోమవారం పొట్టి శ్రీరాములు 125 జయంతి వేడుకలు గ్రంథాలయ అధికారి శివశంకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం కోసం58రోజులు నిరాహార దీక్ష చేసి ప్రాణాలు అర్పించిన గొప్ప వ్యక్తి అనికొనియాడారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, తదితరులుపాల్గొన్నారు.

## ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షలు



**నందలూరు, మార్చి 16 ప్రభాతవార్త :**
మండలంలో పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొత్తం నాగిరెడ్డిపల్లి, టంగుటూరు, పాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఆల్విన్ మోంట్ కార్మెల్ స్కూల్, ఆడపూర్ లోని అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో ఉదయం 9:30 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల 45 నిమిషాల వరకు పదవ తరగతి పరీక్షలు జరిగాయి. మొత్తం 548 మంది విద్యార్థులకు గాను 545 మంది హాజరయ్యారని, 3 గైర్హాజరు కావడం జరిగిందని ఎంఈఓ అనంతకృష్ణ పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు చోటు లేకుండా ఎస్సై మల్లికార్జున్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

## వ్యవసాయ నూతన గ్రామ కమిటీ ఎన్నిక

**గాలివీడు, మార్చి 16(ప్రభాతవార్త):**



మండల పరిధిలోని అరవీడు గ్రామంలోని జగనన్న కాలనీలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా నాయకులు మండెం సుధీర్కుమార్ తెలిపారు. ఈ సమావేశాని వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు పులిమి వెంకటరమణ అధ్యక్షత వహించగా జిల్లా నాయకులు మండెం సుధీర్కుమార్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. రామాంజులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం అధ్యక్షురాలుగా వరలక్ష్మీ, కార్యదర్శిగా నరసింహులు, కోశాధికారిగా ఇస్మాయిల్, సహాయ కార్యదర్శిగా ప్రసాద్, ఉపాధ్యక్షులుగా జమ్రుల్లా, కమిటీ సభ్యులుగా ఈశ్వరమ్మ, ఖాదర్వలీ, వెంకటేష్, ఎన్. లక్ష్మీదేవి తదితరులను ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. ఈ కమిటీ కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు.

## సీఎం చంద్రబాబు ఘన సన్మానం..

**కడప కార్పొరేషన్ మార్చి 16 ప్రభాతవార్త;**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సోమవారం విజయవాడలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వి ఎస్. అమీర్ బాబు సీఎం చంద్రబాబు నాయుడుకు శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. మక్కా నుంచి తెప్పించిన ప్రత్యేక జ్ఞాపికను బహుకరించారు. ఈ సందర్భంగా అమీర్ బాబు మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు రాష్ట్ర మంత్రులు, టిడిపి నాయకులు, వేలాదిగా ముస్లిం సోదరులు పాల్గొన్నట్లు తెలిపారు. బాబు ప్రభుత్వం మైనారిటీలకు అన్ని విదాలుగా ఆదుకుంటుందని సంతోషాన్ని వ్యక్తం చేశారు.

## సీసీ కెమెరాల వైర్ కట్ చేసిన వారిపై
# పోలీసులకు ఫిర్యాదు

### ఎగ్జామ్స్ అసిస్టెంట్ కమీషనర్ శ్రీకాంత్



**సిద్దవటం మార్చి16 ప్రభాతవార్త :**
సిద్దవటం జెడ్పీ ఉన్నత పాఠశాలలోని బి సెంటర్ లో ఏర్పాటు చేసిన 10వ తరగతి పరీక్షా కేంద్రంలోని 4 రూములలో గుర్తు తెలియని వ్యక్తులు సీసీ కెమెరాల వైర్ కట్ చేయడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎగ్జామ్స్ అసిస్టెంట్ కమీషనర్ శ్రీకాంత్ తెలిపారు. మండలకేంద్రమైన సిద్దవటం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎ, బి సెంటర్ లను సోమవారం ఎగ్జామ్స్ అసిస్టెంట్ కమీషనర్ శ్రీకాంత్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దవటం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎ సెంటర్ లో 6 సీసీ కెమెరాలు, బి సెంటర్ల లో 6 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. అయితే బి సెంటర్ లోని 4 రూములకు సంబందించిన సీసీ కెమెరాల వైర్ ను గుర్తు తెలియని వ్యక్తులు కట్ చేశారన్నారు. విచారించి సీసీ కెమెరాల వైర్ ను కట్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా పోలీసులకు సూచించామన్నారు. బుధవారం జరిగే ఇంగ్లీష్ పరీక్ష లోపు 4 రూములలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. పరీక్షా కేంద్రంలో 12 రూములను ఏర్పాటు చేశామని ఎ సెంటర్ లో 136 మంది, బి సెంటర్ లో 135 మంది విద్యార్థులు తెలుగు పరీక్షకు వంద శాతం హాజరైనట్లు ఆయన తెలిపారు. సిద్దవటం ఎస్సై హారిక ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రం వద్ద ఏఎస్ఐలు సుబ్బరామచంద్ర కొండయ్య కానిస్టేబుల్ రాఘవ ప్రతిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

## పాల దుకాణాల ఆకస్మిక తనిఖీ



**ముద్దనూరు, మార్చి16 ప్రభాతవార్త :**
స్థానిక పట్టణంలోని మేజర్ గ్రామ పంచాయతిలోని వివిధ పాల సేకరణ, పాల శీతలీకరణ మరియు పాల అమ్మకదారుల షాపులను ఉన్నత అధికారులు ఆదేశాల మేరకు సోమవారం నాడు డాక్టర్ వాసా శ్రీనివాస ఆకస్మిక తనిఖీ చేసి వారికి సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది. ముఖ్యముగా సంబంధిత అధికారులు వద్ద లైసెన్స్ తీసుకోవడము, పాల శీతళికరణలో తీసుకోవలసిన జాగ్రత్తలు మరియు శుభ్రతా ప్రమాణాల గురించి వివరించడము జరిగింది. ఈ కార్యక్రమంలో యల్. యస్. ఎ. సూర్యబాబు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షలు

**ముద్దనూరు, మర్చి 16, ప్రభాతవార్త :**



మండలం లోని జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాల మరియు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం రోజు ప్రారంభయిన తెలుగు పరీక్షకు మండలంలోని ఐదు ప్రభుత్వ పాఠశాలు మరియు మూడు ప్రైవేట్ పాఠశాలల నుండి 297 మంది విద్యార్థులకు గాను 296 మంది విద్యార్థులు హాజరు అయినట్లు మండల విద్యాశాఖధికారి నాగేశ్వర నాయక్ తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యాశాఖధికారి మాట్లాడుతూ పరీక్ష కేంద్రం నందు విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా మంచినీటి వసతి ఏర్పాటు చేశామని అలాగే విద్యార్థులకు పరీక్ష హాలు నందు సౌకర్యవంతంగా బల్లలు, ట్యూబ్ లైట్స్, ఫ్యాన్ లు ఏర్పాటు చేయడమైనది అని తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రం లో ఎటువంటి మాస్ కాపింగ్ కు ఆస్కారం లేకుండా ఒక చీఫ్ సూపరింటెండెంట్, ఒక డిపార్ట్మెంట్ ఆఫీసర్, 8 మంది ఇన్విజిలేటర్లు, ఇద్దరు సిట్టింగ్ స్క్వాడ్లను నియమించినట్లు ఆయన తెలియజేశారు.

# నలుగురు ముద్దాయిలకు జీవిత ఖైదు జైలు శిక్ష, జరిమానా

**సిద్దవటం మార్చి16 ప్రభాతవార్త**



మండలంలోని కపర్దీశ్వర స్వామి కోన వద్ద సెప్టెంబర్ 1, 2014 తేదీన జరిగిన హత్య కేసులో నలుగురు ముద్దాయిలకు జీవిత ఖైదు జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ. 2వేలు జరిమానా విధిస్తూ ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి జి. దీనబాబు సోమవారం తీర్పు విలువరించినట్లు సిద్దవటం ఎస్సై హారిక తెలిపారు. ఈ కేసుకు సంబందించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎ1 పంగా అరుణ వివాహేతర సంబంధం కారణంగా అడ్డుగా ఉన్న భర్త కనపర్తి సిద్దారెడ్డిని చంపాలని ఉద్దేశంతో మిగిలిన ముగ్గురు ముద్దాయిలు ఎ2 షేక్. హుస్సేన్ భాష, ఎ3 మారబోయిన బాలకృ!!ష్ణ సురేంద్ర, ఎ4 నస్రుద్దీన్ గౌస్ పీర్ లతో కలిసి ముందుగా వేసుకున్న పథకం ప్రకారం భర్తను చంపి అతని దగ్గర ఉన్న బంగారు నగలను తీసుకొని, ఎవరో గుర్తు తెలియని దొంగలు తన భర్తను చంపి బంగారు నగలను దోచుకున్నారని కట్టు కథ అల్లేందుకు ప్రయత్నించిదన్నారు. ఈ కేసులో ఎ1 పంగా అరుణ గతంలో వివాహమై విడాకులు తీసుకున్నట్లు, ఎ2 హుస్సేన్ భాషను ప్రేమించిందన్నారు. అతనితో వివాహం చేసేందుకు తన తల్లి అంగీకరించక పోవడంతో బద్వేల్ కు చెందిన (వికలాంగుడైన) కనపర్తి సిద్దారెడ్డితో వివాహం జరిపించిందన్నారు. అందుకు ఎ1 పంగా అరుణ తన భర్తను చంపి తన భర్త దగ్గర నుంచి బంగారు నగలను దోచుకుని మనం ఎక్కడికైనా వెళ్లి బతుకుదామని ఎ2 హుస్సేన్ భాష కు చెప్పిందన్నారు. అందుకు ఎ2 హుస్సేన్ బాషా తన స్నేహితులైన మారబోయిన బాలకృష్ణ, గౌస్ పీర్ల తో ముందుగా వేసుకున్న పథకం ప్రకారం ముగ్గురు ముద్దాయిలు సిద్ధవటం మండలం కపర్దీశ్వర స్వామి కోన వద్ద వేచి ఉన్నారన్నారు. ఎ1 పంగా అరుణ తన భర్తని మోసగించి అక్కడికి తీసుకురాగా ముద్దాయిలు అందరూ కలిసి అతని దగ్గర ఉన్న బంగారు నగలను దోచుకుని రాళ్లతో కొట్టి మృతుడి యొక్క బెల్టు తీసి మెడకు బిగించి, అక్కడ పడవేసి వెళ్ళిపో యారన్నారు. ఎ1 పంగా అరుణ తన అమ్మ మరియు మేనమామల సహాయం తో తన అత్తవారింటికి వెళ్లి తన భర్తను ఎవరో గుర్తు తెలియని దొంగలు చంపి బంగారం నగలను దోచుకొని వెళ్లినట్లు చెప్పిందన్నారు. వారు అనుమానంతో దబాయించగా తన భర్తను కొట్టి పడేసిన చోటుకి తీసుకెళ్లగా కొన ఊపిరితో ఉన్న మృతుడు కనపర్తి సిద్దారెడ్డి ని కడప రిమ్స్ హాస్పిటల్ లో చేర్పించారన్నారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం చెన్నై విజయ హాస్పిటల్ నందు చికిత్స పొందుతూ 15 రోజుల తర్వాత మృతి చెందినట్లు పోలీసుల విచారణలో తేలిందన్నారు. మృతుడి తండ్రి కనపర్తి రామిరెడ్డి ఫిర్యాదు మేరకు విచారణ అధికారి అప్పటి ఒంటిమిట్ట సర్కిల్ ఇన్స్పెక్టర్ టి. రెడ్డప్ప విచారణ చేసి, కేవలము రెండు రోజులలో కేసును ఛేదించి, సెప్టెంబర్ 3, 2014 ముద్దాయిలను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి దోచుకునిన బంగారు నగలను సీజ్ చేసి జ్యుడీషియల్ రిమాండ్ కు తరలించారన్నారు. కేసును విచారించి కోర్టులో చార్జిషీటు ఫైల్ చేయడం జరిగిందన్నారు. ఈ కేసును ఎస్సీ, ఎస్టీ మరియు ।జు ఎడిజే కడప కోర్టు న్యాయమూర్తి విచారణ చేసి సాక్షులను విచారించి ముద్దాయిలు ఎ1, ఎ2, ఎ3, ఎ4 నేరం చేసినట్లు నిరూపణ కావడంతో న్యాయమూర్తి జి. దీనబాబు ముద్దాయిలకు జీవిత ఖైదు జైలు శిక్ష, మరియు ఒక్కొక్కరికి రూ. 2,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారన్నారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరఫున సమర్ధవంతంగా వాదనలు వినిపించిన స్పెషల్ పీపీ ఎల్. బాలాజీ ని అప్పటి ఒంటిమిట్ట సర్కిల్ ఇన్స్పెక్టర్ టి. రెడ్డప్ప ను, ప్రస్తుత రాజాంపేట ఎఎస్పీ మనోజ్ రామనాథ్ హెగ్డే, ప్రస్తుత ఒంటిమిట్ట సీఐ పి. నరసింహరాజు, సిద్ధవటం ఎస్సై పి. హారిక, కోర్ట్ కానిస్టేబుల్ సి. మల్లికార్జున రావు ను కడప జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ అభినందించినట్లు ఎస్సై తెలిపారు.

## కళాకారులకు నిలయం రాయలసీమ..

### కమిషనర్ రాకేష్ చంద్ర, టూరిజం, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సురేష్



**కడప కార్పొరేషన్ మార్చి 16 ప్రభాతవార్త:**
రాయలేని సీమ రతనాల సీమ రాయలసీమలో సాహితీవేత్తలు, కళాకారులు ఎందరో జన్మించారనీ కడప కార్పొరేషన్ కమిషనర్ కూచిపూడి రాకేష్ చంద్ర, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సురేష్లు గుర్తు చేశారు. కడప జిల్లాలో అన్నమాచార్యులు, కవయిత్రి మొల్ల, వేమన, వీరబ్రహ్మేంద్రస్వామి వంటి మహాత్ములు జన్మించారన్నారు. వారి అడుగుజాడల్లో యువత నడవాలని.. అందుకు తగ్గట్లుగా క్రౌన్ ఆఫ్ రాయలసీమ వారు యువతను ప్రోత్సహించడం అభినందనీయమని అన్నారు. డా. అనురుద్, నిహారిక, రాధిక ఆధ్వర్యంలో సోమవారం కడప బ్రాహ్మణ వీధిలో క్రౌన్ ఆఫ్ రాయలసీమ పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువులతో పాటు కలలు ముఖ్యం అన్నారు. ప్రైడ్ ఆఫ్ రాయలసీమ వారు అందరిని యువతను ప్రోత్సహిస్తున్నారు. దేశస్థాయిలో కడప కళాకారులు రాణించడానికి అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మహేష్, వెంకీ, చిన్న పాల్గొన్నారు.

## వాసవి, వనిత క్లబ్ ఆధ్వర్యంలో మంచినీటి చలివేంద్రం ప్రారంభోత్సవం

**బద్వేల్ అర్బన్ మార్చి 16 ప్రభాతవార్త :**
బద్వేల్ పట్టణంలో గత పది సంవత్సరాలుగా వేసవికాలం ప్రారంభంలోనే ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుంది, సోమవారం వాసవి క్లబ్ అధ్యక్షులు భూపాలం రాఘవేంద్రరావు, సెక్రటరీ చిందుకూరి వెంకటరమణ, ట్రెజరర్ బైసాని సుమంత్, వనిత క్లబ్ అధ్యక్షురాలు చాటకొండ కోటేశ్వరమ్మ, సెక్రటరీ చెప్పగిరి వెంకటసుబ్బమ్మ, ట్రెజరర్ బచ్చు పార్వతమ్మల ఆధ్వర్యంలో మైదుకూరురోడ్ వాసవి మెడికల్ స్టోర్ ఆవరణంలో మంచినీటి చలివేంద్రాన్ని వారి చేతులమీదుగా ప్రారంభించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట పట్టణానికి వివిధ గ్రామీణ ప్రాంతాల నుండి విచ్చేయుచున్న ప్రజల, పాదాచార్ల దాహార్తిని దృష్టిలో పెట్టుకొని మంచినీటి కూల్ ఫ్రైజ్ ద్వారా చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు, వేసవి కాలంలో ప్రజల దాహర్తి తీర్చుట కొరకు మరికొందరు కూడా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని వారు పేర్కొన్నారు, ప్రజల దాహర్తి తీర్చడమే వాసవి వనిత క్లబ్ లక్ష్యమని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వారి ఆదేశాల మేరకు బద్వేల్ పట్టణంలో మంచినీటి చలివేంద్రాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు, ఈ కార్యక్రమంలో తులసి వెంకటసుబ్బయ్య పలువురు పలువురు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.




## ఘనంగా అమరజీవి
# పొట్టి శ్రీరాములు 125 జయంతి

**నందలూరు, మార్చి 16 ప్రభాతవార్త :**
లయన్స్ క్లబ్, వాకర్స్ క్లబ్ ల ఆధ్వర్యంలో సోమవారం అరవపల్లి లోని బచ్చు భవన్ నందు అమరజీవి పొట్టి శ్రీరాములు 125 జయంతిని పురస్కరించుకొని పొట్టి శ్రీరాములు చిత్రపటానికి విభా ఎరుడైట్ స్కూల్ ఛైర్మన్ జయ భాస్కర రావు పూలమాల వేసి ఘనంగా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్సై మన్నెం రామమోహన్ మాట్లాడుతూ శ్రీరాములు ఆంధ్ర రాష్ట్రం కోసం ఆత్మార్పణ చేసుకున్నారని, ఇవాళ మనం ఆంధ్రులం అని చెప్పుకుంటున్నామంటే అది వారి ఆత్మార్పణ బలిదానం నుండి వచ్చిందని అన్నారు. 53 రోజులపాటు ఆమరణ దీక్ష చేసి ఆయన చనిపోవడం జరిగింది అందుకే రాష్ట్ర ప్రభుత్వం వారి బలిదానం గుర్తుచేసుకొని రాజధాని అమరావతి నందు ఇవాళ 58 అడుగుల విగ్రహాన్ని ఆవిష్కరించడం జరుగుతుండడం ఆంధ్రులుగా మనందరికీ గర్వకారణమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటిఎస్ ప్రొఫెసర్ ఎంబలూరు ప్రదీప్, లయన్ కుర్ర మణి యాదవ్, ఉప్పు శెట్టి సుధీర్, మోదపోతుల రాము, గంధం గంగాధర్, గురు ప్రసాద్, నీటి సంఘం అధ్యక్షులు బూశెట్టి వెంకటసుబ్బయ్య, మంటి మారయ్య, సునీల్ రెడ్డి, త్యాగరాజు, వలిమి సుధాకర్ పాల్గొనడం జరిగింది.




## నిజాయితీకి మారుపేరు ఎమ్మెల్యే వరద

**ప్రొద్దుటూరు అర్బన్ మార్చి 16 ప్రభాత వార్త**
నీతి నిజాయితీకి మారుపేరు నంద్యాల వరదరాజుల రెడ్డి కుటుంబమని రాజుపాలెం మండల రైతు సుధాకర్ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక నెహ్రూ రోడ్డు లోని టిడిపి కార్యాలయంలో ఆయన విలేఖరులు సమావేశంలో మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ఆరోపించిన విధంగా రైతులను మార్కెట్ యార్డ్ లో అదనపు రుసుము కోసమో, బస్తాకు అదనంగా శనగలు అడిగిన నేపథ్యంలో రైతులు బయటి వ్యాపారులను ఆశ్రయిస్తారే కానీ ప్రభుత్వ మద్దతు ధర ఖర్చులకు సరిపోని పక్షంలో మార్కెట్ యార్డ్ లో ఎందుకు విక్రయిస్తారని ప్రశ్నించారు. వరదరాజులరెడ్డి రైతులకు అన్యాయం జరిగితే సహించరన్నారు. ఆయన నిజాయితీ పరుడు కావడం వలనే ఆయనను ప్రజలు 6వ సారి గెలిపించారని స్పష్టం చేశారు. రాచమల్లు అబ్బ భైరవ కొండారెడ్డి, భైరవ కొండారెడ్డి సోదరుడు రాచమల్లు రామచంద్రారెడ్డి కవులు కావడంతో ఆయనకు వాక్చాతుర్యం వుందని తెలిపారు. అనంతరం టిడిపి నాయకులు శంకర్ మాట్లాడుతూ రాచమల్లు శివప్రసాద్ రెడ్డి కి బిసిలంటే అలుసని అందుకే ఆయన మార్కెట్ యార్డ్ ఛైర్మన్ అయిన మహిళను ఉత్సవ విగ్రహం అన్నారని, మైనారిటీలన్నా ఆయనకు గిట్టని కారణంగానే ఆయన టిడిపి మైనారిటీ నాయకులు రసూల్ గౌస్ పై బురదజల్లుతున్నారని విమర్శించారు. సీఎం చంద్రబాబు ను, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ను, మంత్రి లోకేష్ ను వ్యంగ్యంగా విమర్శించడం సరి కాదన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పగిడేల దస్తగిరి, రసూల్ గౌస్ పాల్గొన్నారు.




## బసవేశ్వర ఆలయానికి వెండి కిరీటం బహుకరణ

**ముద్దనూరు, మార్చి 16, ప్రభాతవార్త :**
ముద్దనూరు మండలం బొందలకుంట గ్రామంలో వెలసిన అతిపురాతణమైన శ్రీ బసవేశ్వర స్వామి కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా విరజిల్లుతున్నాడు. దీనికి నిదర్శనం జంగంరెడ్డి పల్లె గ్రామ వాస్తవ్యులు అయినటువంటి క్రిష్నిపాటి శ్రీ సుదర్శన్ రెడ్డి ధర్మపత్ని గురుశ్రీ దంపతులు స్వామి వారిని మనస్పూర్తిగా వేడుకొనగా వారి కొరికను తీర్చినందుకు గాను వారు ఆ బసవేశ్వర స్వామి దేవస్థానంకి సుమారు 1,70,000/రూ విలువ గల వెండి కిరీటంను సోమవారం నాడు ఆలయ అర్చకులు అనిల్ స్వామికి బహుకరించి వారి మొక్కును తీర్చుకున్నారని ఆలయ అర్చకులు తెలిపారు.



మామిడిలో పిందెలు రాలకుండా

# రైతులు తగు జాగ్రత్తలు పాటించాలి

**లక్కిరెడ్డిపల్లి: మార్చి 16 ప్రభాతవార్త**

మామిడిలో పిందెలు రాలకుండా రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని ఉద్యాన శాఖ అధికారిని సింధూరి పేర్కొన్నారు. సోమవారం ఆమె కోనంపేట గ్రామంలో పర్యటించి పలు రైతుల మామిడి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉద్యాన శాఖ అధికారిని సింధూరి మాట్లాడుతూ మామిడి తోటలో పిందె ఏర్పడిన తర్వాత మంచి దిగుబడి నాణ్యత రావాలంటే నీటి నిర్వహణ చెట్టుకి 7 నుండి పది రోజులు ఎదలో తగినంత నీరు అందించాలని, మట్టిలో తేమ ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని, డ్రిప్ పద్ధతి ద్వారా నీటిని ఇవ్వడం ఉత్తమమైన ఎంపిక అన్నారు. నీటి కొరత ఉన్నట్లయితే పిందెలు రాలిపోవడం జరుగుతుందని కాబట్టి పిందెలు రాలకుండా ఉండేందుకు ప్లోనోఫిక్స్ 4.5 లీటర్లకు ఒక ఎంఎల్ కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. పండ్లు పెరుగుదల కోసం 500 గ్రాములు యూరియా ఒక కేజీ ఎస్ఎస్పి 500 గ్రాములు ఎంఓపి ఒక మొక్కకి అందించాలన్నారు. అదేవిధంగా పొటాషియం నైట్రేట్ ఐదు గ్రాములు ఒక లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. క్యాల్షియంనట్రేట్ అయిదు గ్రాములు ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. మామిడిలో మంచి దిగుబడికి సూక్ష్మ పోషకాలు ఎంతో అవసరమని బోరాన్, కాల్షియం, మెగ్నీషియం వంటి సూక్ష్మ పోషకాలు పిచికారి చేసుకోవాలన్నారు. మామిడి తోటలో పండు ఈగ ఉధృతిని తగ్గించుకొని నాణ్యమైన పండ్ల కోసం ఫెరోమోన్ ట్రాప్స్ అమర్చి ఫ్రూట్ కవర్స్ వినియోగించాలన్నారు. రాలిన పిందెలు చెత్తను వెంటనే తొలగించాలన్నారు తోటలో కలుపు మొక్కలు లేకుండా శుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఫ్రూట్ కవర్లు కొనుగోలు చేయడానికి సమీపంలోని రైతు సేవా కేంద్రంలో ఆసక్తి గల రైతులు సంప్రదించి కొనుగోలు చేయవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో మామిడి రైతులు పాల్గొన్నారు.



మామిడిలో పిందె రాలకుండా అవగాహన కల్పిస్తున్న ఉద్యాన శాఖ అధికారిని

## భావితరాలకు స్ఫూర్తి అమరజీవి

**కడప కార్పొరేషన్ మార్చి 16 ప్రభావతవార్త:**

ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు 58 రోజుల నిరాహార దీక్ష చేసి ప్రాణత్యాగం చేశారనీ డిప్యూటీ లైబ్రేరియన్ ఎలిశెట్టి పవన్ కుమార్ గుర్తు చేశారు. తెలుగు యువతకు శ్రీరాములు స్ఫూర్తిదాయమన్నారు. సోమవారం కడప జిల్లా కేంద్ర గ్రంథాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతిని చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు జాతి ఆత్మగౌరవం కోసం ఆయన చేసిన నిస్వార్థ పోరాటం నేటి యువతకు, పాఠకులకు ఆదర్శమని పేర్కొన్నారు. మహానుభావుల జీవిత చరిత్రలు గ్రంథాలయాల్లో నిక్షిప్తమై ఉన్నాయని, పాఠకులు వాటిని చదివి స్ఫూర్తి పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రేడ్3 లైబ్రేరియన్ గొందిపల్లి రాజ్ కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.



అవి ప్రభుత్వ కార్యాలయ భవనాలు.

## పన్ను బకాయిలు రూ. లక్షల్లో....

**..సామాన్య ప్రజలు ఏడాదిపాటు పన్ను బకాయి ఉంటే హెచ్చరికలు చేసే అధికారులు.. ప్రభుత్వ భవనాల బకాయిలపై మాత్రం అధికారుల ఉదాసీనత...**

**యర్రగుంట్ల మార్చి 15, ప్రభాతవార్త**



మున్సిపల్ పరిధిలో పన్నుల బకాయిలు గుదిబండలా మారాయి. సామాన్య ప్రజల నుంచి సక్రమంగా పన్నులు వసూళ్లు అవుతున్నా. ప్రభుత్వ కార్యాలయాల భవనాలకు సంబంధించి మాత్రం రూ.కోట్లలో పేరుకుపోయాయి. యర్రగుంట్లలో మండల స్థాయి ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. నిబంధనల ప్రకారం ఏటా మున్సిపాలిటీ ఆయా కార్యాలయాలు పన్ను చెల్లించాలి. కానీ కొన్ని ప్రభుత్వ సంస్థలైతే ఏకంగా 10, 20 సంవత్సరాల పన్ను చెల్లించడం లేదు. ఆ విషయమే ఆయా శాఖల అధికారులు మరిచిపోతున్నారు. అలాగే పన్నుల వసూళ్లు కేవలం సామాన్యుల నుంచి మాత్రమేనని.ప్రభుత్వ భవనాల నుంచి కాదన్న రీతిలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది వ్యవహరిస్తున్నారు. ఫలితంగా యర్రగుంట్ల మున్సిపాలిటీకు ప్రభుత్వ భవనాల నుంచి రావాల్సిన బకాయిలు సుమారు రూ.3.40 కోట్లు ఉన్నాయి. కానీ, ప్రస్తుతం వసూలైంది కేవలం రూ.5లక్షలు మాత్రమే. అంతకు మించి వసూళ్లవుతాయన్న నమ్మకం అధికారులకు లేదు. ప్రభుత్వ భవనాలకు సంబంధించి ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లించాలంటే.. సంబంధిత భవనాలకు శాఖల వారీగా ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేయాలి. ఈ విషయంలో అధికారులు కూడా శ్రద్ధ చూపకపోవడంతో ప్రభుత్వం ఎప్పుడు మంజూరు చేస్తే అప్పుడే చెల్లిస్తున్నారు. దీంతో బకాయిలు పేరుకుపోయి మున్సిపాలిటీ అభివృద్ధి గగనమవుతోంది. ఇలా అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాలకు సంబంధించి భారీగా పేరుకుపోయిన పన్ను బకాయిలు ఎప్పటికి వసూళ్లు అవుతాయనేది ప్రశ్నార్థకమే.

**ప్రభుత్వ భవనాల పన్ను బకాయిలు ఇలా...**

రైల్వే స్టేషన్, రైల్వే క్వార్టర్స్ రూ.70 లక్షలు.
పోలీస్ స్టేషన్, పోలీస్ క్వార్టర్స్ రూ.30 లక్షలు.
ఎమ్మార్వో, ఎంపీడీవో, ఎంఈఓ కార్యాలయాలు రూ.23 లక్షలు.
కరెంట్ ఆఫీస్, సబ్ స్టేషన్ రూ.50 లక్షలు.
పట్టణంలో మిగిలిన ప్రభుత్వ కార్యాలయాలు రూ.1.62 కోట్లు.

ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ శేషఫణి ని వివరణ కోరగా పన్నులు చెల్లించని ప్రభుత్వ కార్యాలయాలకు పలు దఫాలు నోటీసులు అందజేశామని అక్కడి సిబ్బంది తమ ఉన్నతాధికారులకు నోటీసులు పంపండి నిధులు మంజూరు అవ్వగానే చెల్లిస్తామంటూ చెబుతున్నట్లు కమిషనర్ తెలిపారు.

## వంతాటిపల్లి లోరైతన్న మీ కోసం



**సిద్ధవటం మార్చి 16 ప్రభాతవార్త:**

మండలంలోని వంతటిపల్లి గ్రామంలో రైతన్న మీ కోసం కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారి కర్నాటి రమేష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ రైతులతో కలసి రైతన్న మీ కోసం కరపత్రాలను ఆవిష్కరించారు. తదుపరి రైతన్న మీ కోసం కార్యక్రమము గురించి రైతులకు అవగాహన కల్పించారు.రైతన్న మీ కోసం కార్యక్రమంలో రూపొందించిన 5 పంచ సూత్రాల గురించి వివరించారు. ఎలినినో ప్రభావం గురించి రైతులకు అవగాహన కల్పించి అందుకు తగ్గట్లు ప్రణాళిక చేసుకుని పియండీఎస్ పద్ధతులను పాటించాలని తెలిపారు.తదుపరి యూరియా వాడకం గురించి గోడ పత్రాలను ఆవిష్కరించి రైతులకు అవగాహన కల్పించారు. తదుపరి వంతటిపల్లిలో రైతన్న మీ కోసం కార్యక్రమంలో పాల్గొని వ్యవసాయ పథకాల గురించి అవగాహన కల్పించారు.పొలం కలిగి ఉన్న ప్రతి రైతు ఎపి యాప్ ఆర్ పోర్టల్ లో రైతు రిజిస్ట్రేషన్ చేసుకుని విశిష్ట గుర్తింపు సంఖ్య ఐడిని పొందాలి అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రమేష్ రెడ్డి, వ్యవసాయ విస్తీర్ణ అధికారి వై.ప్రభాకర్ రెడ్డి,. గ్రామ వ్యవసాయ సహాయకుడు కె. చంద్రమోహన్,పకృతి వ్యవసాయ సిబ్బంది మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

## తెలుగు ప్రజల ఆరాధ్యదైవం అమరజీవి పొట్టి శ్రీరాములు

**బద్వేలు అర్బన్ , మార్చి 16, ప్రభాతవార్త**

ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడి అసువులు బాటిన మహనీయుడు పొట్టి శ్రీరాములు, ఆయన 125వ జయంతి కార్యక్రమం బద్వేల్ పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం కోసం 58 రోజులు మహోత్సవాల జాతీయ ఉద్యమం చేసి అసువులు బాసిన మహనీయులలో పతాక శీర్షిక పొందిన వ్యక్తి పొట్టి శ్రీరాములు అన్నారు, ఆయన హరిజనోదరణ, హరిజనుల దేవాలయ ప్రవేశం ఖాదీ ప్రచారం ఉద్యమం చేశారని అలాగే మద్యపానం మాన్పించుటకు మరియు పారిశుధ్య కార్మికుల సమస్యలపై పోరాటం చేసిన యోధుడన్నారు, పతిత జనోదరణ బిక్షవుల సమస్యలపై పోరాటం చేశాడన్నారు, ఉప్పు సత్యాగ్రహం క్విట్ ఇండియా ఉద్యమం తదితరు ఉద్యమాలు చేసి 58 రోజులు నిరాహార దీక్ష చేసి చేశాడని, ఆయన చేసిన త్యాగఫలమే మద్రాసు రాష్ట్రం నుండి ప్రత్యేక రాష్ట్రము ఏర్పడదని అన్నారు, ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం అసోసియేట్ అధ్యక్షులు గంజిగుంట పుల్లయ్య గౌరవ సలహాదారు గడి పుల్లమరాజు కార్యదర్శి కత్తి బ్రహ్మయ్య కోశాదికారి గంగన్న, ఉపాధ్యక్షులు ముండ్లపాటి పిచ్చయ్య ఆనందరావు ప్రసాద్ శ్రీరాములు వెంకటేశ్వర్లు రామసుబ్బయ్య సుబ్బరాయుడు బాల ఓబయ్య లక్ష్మీనరసయ్య, ప్రభాకర్ రెడ్డి శ్రీనివాసులు రెడ్డి శ్రీరాములు, ఇస్మాయిల్ తదితరులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.



## పదవ తరగతి పరీక్షలు ప్రశాంతం

**చాపాడు, మార్చి16.ప్రభాతవార్త :**

మండలంలోపదవ తరగతి పరీక్షలు మొదటిరోజు శనివారం తెలుగు పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు అధికారులు తెలిపారు. 352 మంది విద్యార్థులకు గాను నలుగురు విద్యార్థులు మాత్రమే గైర్హాజరు అయినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాలవద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ఎస్సై, చిన్నపెద్ద ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



## ఏవీఆర్ స్కూల్‌లో అగ్ని భద్రత అవగాహన కార్యక్రమం

**బద్వేలు అర్బన్ , మార్చి 16, ప్రభాతవార్త**

విద్యార్థుల్లో అగ్ని ప్రమాదాలపై అవగాహన పెంపొందించేందుకు అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో బద్వేల్ పట్టణంలోని ఏవీఆర్ స్కూల్‌లో సోమవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక అధికారులు ప్రత్యక్ష ప్రదర్శనల ద్వారా అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్ వినియోగం, ప్రమాద సమయంలో సురక్షితంగా బయటపడే విధానాలపై విద్యార్థులకు వివరించారు. అదేవిధంగా ప్రమాదాల్లో గాయపడిన వారిని ఎలా సురక్షితంగా తరలించాలి, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు వంటి అంశాలను ప్రాక్టికల్‌గా చూపించారు. ఈ కార్యక్రమానికి స్టేషన్ ఫైర్ ఆఫీసర్ చంద్రుడు మరియు అగ్నిమాపక సిబ్బంది బృందం మార్గదర్శనం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో ధైర్యంగా, సమర్థంగా స్పందించాల్సిన అవసరాన్ని వారు వివరించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ సురేష్ బాబు మాట్లాడుతూ విద్యార్థుల్లో అగ్ని భద్రతపై అవగాహన పెంపొందించడం అత్యంత అవసరమని, ఇలాంటి కార్యక్రమాలు అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడేందుకు ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత పెరిగి, అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలో అవగాహన కలిగిందని నిర్వాహకులు పేర్కొన్నారు.



## పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



**ముద్దనూరు,మార్చి16 ప్రభాతవార్త:**

ముద్దనూరు మండలం వేల్పుచర్ల గ్రామంలో జాతీయ గాలికుంటు నివారణ కార్యక్రమం డాక్టర్లు వాసా శ్రీనివాస మరియు కొత్త చౌట్టిపల్లెలో భారతి ఆధ్వర్యంలో సోమవారం నాడు నిర్వహించారు. ఆవులు 20, గేదెలు 140, దూడలు 20 లకు గాలికుంటు నివారణ టీకాలు వేసినట్లు తెలిపారు. డాక్టర్ శ్రీనివాస మాట్లాడుతూ గాలి కుంటు నివారణ టీకాల కార్యక్రమం మండలంలోని ప్రతి గ్రామంలో జరుగుతుందన్నారు. పాడి రైతులు తప్పనిసరిగా మూడు నెలలు దాటిన వారి పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శకుంతలమ్మ, శివలింగేశ్వర్ రెడ్డి, ధరణి, సుధీర్ పాడి రైతులు మరియు అధికారులు పాల్గొన్నారు.

## పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకలు



**మైదుకూరు, మార్చి 16, ప్రభాతవార్త:**

అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకలను ఆర్యవైశ్య సభ ఆధ్వర్యంలో నంద్యాల రోడ్డు అమ్మవారి శాలలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించడం జరిగింది.అనంతరం నంద్యాల రోడ్డు నుండి మార్కెట్ కూడలి వరకు నినాదాలు చేస్తూ పొట్టి శ్రీరాములు విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలతో నివాళులు అర్పించి ఆర్యవైశ్యులు కూడలిలో ఉన్న ప్రజలకు స్వీట్ తో కూడిన చాక్లెట్లు పంచారు. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య సభ కార్యవర్గము,యువజన సంఘము, వాసవి క్లబ్, వనిత క్లబ్, ఏవిఓపిఏ సంఘ ప్రతినిధులందరూ పాల్గొనడం జరిగింది.

## నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం

**ప్రొద్దుటూరు అర్బన్, మార్చి 16, ప్రభాతవార్త**

స్థానిక యర్రగుంట్ల రోడ్డు లోని రెడ్ల కళ్యాణ మండపంలో సోమవారం రెడ్డి సేవా సంఘం నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నూతన అధ్యక్షుడిగా డాక్టర్ నాగదస్తగిరి రెడ్డి, ఉపాధ్యక్షులుగా శెట్టిపల్లె రాంప్రసాద్ రెడ్డి, బి.వి. సుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మార్తల సుధాకర్ రెడ్డి, కోశాధికారి గా ఎల్.వి. రమణారెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శిగా అట్ల నరసింహారెడ్డి, సహ కార్యదర్శులుగా కొవ్వూరు రమేష్ రెడ్డి, గంగిరెడ్డి మాదవరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా గంగిరెడ్డి రామ సుబ్బారెడ్డి, జి. రాజగోపాల్ రెడ్డి, బసిరెడ్డి ప్రసాద్ రెడ్డి, సాకం నాగేశ్వర రెడ్డి, బండిఆత్మకూరు వెంకట్రామిరెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ముందుగా అధ్యక్షుడు డాక్టర్ నాగదస్తగిరి రెడ్డి మాట్లాడుతూ రెడ్ల కళ్యాణ మండపంలో త్వరలోనే మౌలిక సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. అనంతరం సహ కార్యదర్శి గంగిరెడ్డి మాధవరెడ్డి మాట్లాడుతూ దాదాపు 24 సంవత్సరాల తరువాత రెడ్డి సేవా సంఘం ఎన్నికలు ప్రజాస్వామ్య బద్ధంగా జరిగాయని తెలిపారు. ఈ సందర్భంగా తమకు మద్దతుగా నిలిచిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సంఘం ఉపాధ్యక్షుడు శెట్టిపల్లె రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రెడ్ల కళ్యాణ మండపం రెడ్డి సేవా సంఘానికి ఆయువు పట్టు అన్నారు. ఈ కళ్యాణ మండపం నుండి వచ్చే ఆదాయం తోనే సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు. ఈ కార్యవర్గం లో అధ్యక్షుడు, ట్రెజరర్ పోస్టులకు ఎన్నికలు జరగగా, మిగిలిన సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయామని గుర్తు చేశారు. భవిష్యత్తులో రెడ్డి సేవా సంఘం సేవా కార్యక్రమాలు మరింతగా విస్తృత పరుస్తాయి తెలిపారు.




## హాస్పిటల్ గదుల పరిశీలన

**జమ్మలమడుగు, మార్చి 16, ప్రభాతవార్త:**

జమ్మలమడుగులో సోమవారం కాయకల్ప్ స్టేట్ ఎక్స్‌టరననల్ అసెస్మెంట్ టీం విజిట్ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా డా.జనార్ధనం, జాయింట్ డైరెక్టర్ (ఎఫ్‌పీ మరియు పీఎస్) బి.కమలాకర్, పీఓ, యూఎన్‌డీపీ హాస్పిటల్ నందు శానిటేషన్, ఓపీ, ఐపీ, డెలివరీ రూం, ఆపరేషన్ థియేటర్, ల్యాబ్, ఫార్మసీ, ఎక్స్‌రే సర్వీసెస్‌లను క్షుణ్ణంగా పరిశీలించి ప్రభుత్వానికి నివేదికలు సమర్పించడం జరిగింది. హాస్పిటల్ మొత్తం పరిశీలన చేసి అంతా బాగా ఉందని విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డా.రఫీక్ పాషా, ఆర్ఎంవో డా.సునీల్‌కుమార్, వైద్యులు, నర్సింగ్ మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ ఈశ్వరిదేవి మఠం హుండీ ల ఆదాయం 5 లక్షలు



**బ్రహ్మంగారిమఠం మార్చి 16 ప్రభాతవార్త:**

జగన్మాత శ్రీ ఈశ్వరీదేవి మఠం నందు అమ్మవారికి భక్తులు సమర్పించిన కానుకల రూపంలో హుండీల లెక్కింపు ప్రక్రియను మఠాధిపతులు శ్రీ వీరశివ కుమారస్వాములవారి సమక్షంలో శ్రీ ఈశ్వరి దేవి మఠం ప్రాంగణంలో లెక్కించగా 5 లక్షల 9వేల 71 రూపాయలు ఆదాయం వచ్చినట్లు దేవదాయ శాఖ కార్య నిర్వహణ అధికారి జగన్మోహన్ రెడ్డి తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ జనార్ధన్ ప్రభుత్వ అధికారుల సంయుక్త పర్యవేక్షణలో శ్రీ ఈశ్వరీమాత మహిళా సేవ బృందం తదితర భక్తులు మరియు మఠం సిబ్బంది ఉన్నారు. శ్రీ ఈశ్వరిదేవిమఠం మఠాధిపతి శ్రీ శివకుమార్ స్వామి ఆధ్వర్యంలో తలనీలాలు వసూలు హక్కు చేసుకొనుటకు వేలం పాట ద్వారా 71 వేలు ఆదాయం వచ్చినట్లు కార్యనిర్వహణాధికారి జగన్ మోహన్ రెడ్డి తెలిపారు.

## సమస్యలను త్వరగా పరిష్కరించాలి



**దువ్వూరు, మార్చి 16, ప్రభాతవార్త:**

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే వివిధ రకాల సమస్యలను సంబంధిత అధికారులు త్వరగా పరిష్కరించాలని తాసిల్దార్ సంజీవరెడ్డి, ఎంపీడీవో సుబ్బారెడ్డిలు అన్నారు. సోమవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుండి వినతులు స్వీకరించారు. ఎక్కువ మంది రిసర్వేలో జరిగిన లోటుపాట్లను అలాగే కొలతలు వేసి ఇవ్వాలని కోరారు. అనంతరం సిబ్బందిచే మాట్లాడుతూ ఇచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులకు పంపుతున్నామని, నిర్ణీత గడువు లోగా వాటిని పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ లక్ష్మీనారాయణ, ఏఈ శివకుమార్, సుబ్రహ్మణ్యం, మండల టిడిపి కన్వీనర్ బోరెడ్డి వెంకటరమణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్ అరెస్ట్". అనేది చట్టంలో ఎక్కడా లేదు

**ప్రొద్దుటూరు అర్బన్ మార్చి 16 ప్రభాతవార్త**

డిజిటల్ అరెస్ట్ అనేది చట్టంలో ఎక్కడా లేదని సైబర్ నేరగాళ్ల ఉచ్చుల్లో పడకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తతతో అవగాహన పెంపొందించుకోవాలని రెండవ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ పి.వంశీనాథ్ పిలుపునిచ్చారు.భారతీయ రిజర్వ్ బ్యాంక్ వారి సౌజన్యంతో హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక రాణీ తిరుమలాదేవి డిగ్రీ కళాశాలలో ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎస్సై మహబూబ్ బాషా తో కలిసి సిఐ వంశీనాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా ఫిజికల్ గా తప్ప డిజిటల్ అరెస్ట్ అనేది చట్టంలో ఎక్కడా లేదని ఆయన తెలిపారు. విద్యార్థులు సెల్ ఫోన్స్ అవసరం మేరకే వినియోగించాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఆసరా చేసుకుని సైబర్ క్రైమ్స్ కు పాలు పడడం సర్వసాధారణమైనదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అత్యాశకు పోయి మనీ డబ్బింగ్ స్కీములకు అవకాశం ఇవ్వరాదని ఆయన హెచ్చరించారు. అన్ నౌన్ లింక్స్ క్లిక్ చేయరాదని మోసపూరిత లింక్స్ పైన క్లిక్ చేయరాదని ఆయన హెచ్చరించారు. ఎవరైనా సైబర్ క్రైమ్స్ గురి అయిన తక్షణమే 1930 నెంబర్ కు వెంటనే ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. ఎస్సై మహబూబ్ బాషా మాట్లాడుతూ ఆన్లైన్ షాపింగ్ పేరిట వచ్చే ఓటిపి లకు ఉపాధి అవకాశాలను ఆశగా చూపించే మోసపూరిత సందేశాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకొని సైబర్ నేరాల బారిన పడరాదని హెచ్చరించారు అలాగే అనవసరమైన లింక్స్ కు అనవసరమైనటువంటి కాల్స్కు స్పందించరాదని ఆయన సూచించారు.కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలోని ప్రతి ఒక్కరు సైబర్ నేరగాల ఎత్తుగడలను చిత్తు చేసే అంశాల పట్ల అవగాహన పెంపొందించుకోవాలని ఆయన కోరారు హెడ్స్ అధ్యక్షులు కృష్ణయ్య యాదవ్ మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరు అవగాహన పెంపొందించుకోవాలని ఆయన కోరారు ఈ సందర్భంగా సైబర్ నేరాల పట్ల అవగాహనబంధించే ప్రోత్సహిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎస్ వెంకటేశ్వర్ రెడ్డితో పాటు హెడ్స్ కోఆర్డినేటర్ కె .ఉదయ్ కుమారు కళాశాల విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.




## ముస్లిం సోదరులకు రంజాన్‌తోఫా కిట్ల పంపిణీ

**గాలివీడు, మార్చి 16(ప్రభాతవార్త):**

ముస్లింల పవిత్ర పండుగ రంజాన్‌ను పురస్కరించుకొని గాలివీడు మండలంలోని గోపనపల్లి గ్రామంలో సోమవారం గ్రామ టీడీపీ నాయకుడు మిట్టపల్లి వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో మంత్రి సోదరుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా గ్రామంలోని పలు ముస్లిం మైనార్టీ కుటుంబాలకు, పేద హిందూ సోదరులకు కూడా నిత్యావసర సరుకులతో రంజాన్‌తోఫా కిట్లను అందజేశారు. పేద హిందూ సోదరులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ పవిత్ర రంజాన్‌మాసంలో పాటించే ఉపవాస దీక్షలు ఎంతో భక్తిశ్రద్ధలతో పాటిస్తారని, అల్లా ఆశీస్సులు ఎల్లప్పుడూ అందరికీ ఉండాలని కోరారు. ఈ పవిత్రమైన రంజాన్ మాసంలో చిన్నపిల్లల నుంచి మొదలుకొని వృద్ధుల వరకు కఠోర నియమాలతో ఉపవాస దీక్షలు చేయడం గొప్ప విషయమన్నారు. రంజాన్ మాసంలో మత సామరస్యానికి ప్రతీక, మత సామరస్య భావం పెంపొంది ప్రజల మధ్య ఐక్యత పెరుగుతుందన్నారు. రంజాన్ మాసంలో ప్రతి ఒక్కరూ ఆరాధనలకు ప్రాధాన్యత ఇవ్వాలని, గ్రామ టీడీపీ నాయకులు వెంకటరమణారెడ్డి వివిధ రకాల నిత్యావసర సరుకులతో కూడిన కిట్టును అందజేయడం శుభపరిణామమన్నారు. ముస్లిం సోదరులకు ముందస్తుగా రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు హేమకుమార్‌రెడ్డి, మండల టీడీపీ నాయకులు గీదర ధర్మారెడ్డి, సింగిల్ విండో శ్రీనివాసులురెడ్డి, డీలర్ శ్రీనివాసులురెడ్డి, మురళీమోహన్‌నాయుడు, సూరిబాబు, శ్రీకాంత్, ఉదయ్, శేఖర్‌రెడ్డి, కోటిరెడ్డి, సుంకర రవీంద్రబాబు, హబీబుల్లా, అమీన్‌పీర్, కె.వీరారెడ్డి, ఎస్.ఖాదర్‌వలీ, గోపన రెడ్డప్పనాయుడు, చిన్నరెడ్డప్పనాయుడు, ఖాజాపీర్, సవదయ్య, స్థానిక గ్రామ మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



రైతుల ఖాతాకు

## అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ నిధులు

**రాజుపాళెం, మార్చి 16, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని అరకటవేముల గ్రామంలో సోమవారం వ్యవసాయ శాఖ అధికారి శివరామకృష్ణారెడ్డి రైతులతో సమావేశమై అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధులు రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం రైతులను ఆదుకొనుటకు పంట సాగుకు సహాయంగా మూడవ విడత అన్నదాత సుఖీభవ రూ.4వేలు, 22 వ విడత పీఎం కిసాన్ నిధులు రూ.2 వేలు రైతుల ఖాతాలకు మళ్లించినట్లు తెలుపుతూ ముఖ్యమంత్రి సందేశమును రైతులకు వినిపించారు. మండల పరిధిలోని 11 రైతు భరోసా కేంద్రాల ఆధ్వర్యంలో వ్యవసాయ సహాయ అధికారులు రైతుల ఇళ్ల వద్దకు వచ్చి రైతన్న మీకోసం కార్యక్రమంలో నిర్వహిస్తారని దానిని ప్రతి రైతు విజయవంతం చేయాలని ఏవో కోరారు.

